
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

కృష్ణా జిల్లా వార్తలు

శుక్రవారం 19 ఏప్రిల్ 2024



నామినేషన్ల సందడి మొదలైంది. గురువారం అలా నోటిఫికేషన్ విడుదలైందో.. ఇలా నామినేషన్లు దాఖలు చేయడానికి అభ్యర్థులు పోటీ పడ్డారు. మొదటి రోజు, పైగా మంచిరోజు కావడంతో అభ్యర్థులు అట్టహాసంగా తరలివచ్చారు. దీంతో విజయవాడలోని కలెక్టరేట్ వద్ద సందడి వాతావరణం కనిపించింది. ఇక ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా 13 నామినేషన్లు, కృష్ణా జిల్లావ్యాప్తంగా 5 నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రధాన పార్టీ అభ్యర్థులు భారీ ర్యాలీలతో అట్టహాసంగా తరలిరావడంతో అంతటా ఎన్నికల సందడి కనిపించింది.

- విజయవాడ/మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి



అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న సుజనా చౌదరి, (ఇన్‌సెట్‌లో) చిట్టినగర్‌లో ర్యాలీ

తొలిరోజే కోలాహలం

నోటిఫికేషన్ విడుదల.. వెనువెంటనే నామినేషన్లు

- ఎన్టీఆర్ జిల్లాలో 13, కృష్ణాజిల్లాలో 5 నామినేషన్లు
- విజయవాడ కలెక్టరేట్ సమీపంలో ర్యాలీల సందడి
- కృష్ణాజిల్లాలో ఆరు ప్రాంతాల్లో నామినేషన్ల స్వీకరణ
- మంచి ముహూర్తం చూసుకుంటున్న అభ్యర్థులు
- ఈ నెల 25వ తేదీ వరకు గడువు

ఎన్టీఆర్ జిల్లాలో..

ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి మొత్తం 13 నామినేషన్లు పడ్డాయి. వీటిలో రెండు విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోవి కాగా, 11 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందినవి. మొత్తంగా టీడీపీ తరఫున రెండు నామినేషన్లు, వైసీపీ తరఫున ఒక నామినేషన్ దాఖలయ్యాయి. నామినేషన్ల ఘట్టం ప్రారంభానికి ముందు జిల్లా ఎన్నికల అధికారి దిల్లీరావు పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల పబ్లిక్ నోటీసును విడుదల చేశారు. ఎక్కడికక్కడ రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటీసును విడుదల చేశారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి నామినేషన్ల ఘట్టం ప్రారంభమైంది. సాయంత్రం 3 గంటల వరకు స్వీకరించారు. అభ్యర్థులు నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేసే అవకాశాన్ని కల్పించారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు భారీ సంఖ్యలో ర్యాలీగా రాగా, రిటర్నింగ్ కార్యాలయానికి 100 మీటర్ల దూరంలోనే నిలుపుదల చేయించారు. అభ్యర్థి సహా కేవలం ఐదుగురినే కార్యాలయంలోకి అనుమతించారు.

విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో..

విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గురువారం రెండు నామినేషన్లు పడ్డాయి. సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (కమ్యూనిస్టు) తరఫున విజయవాడలోని అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన గుజ్జుల లలిత (61) నామినేషన్ వేశారు. అలాగే, తెలంగాణ రాష్ట్రం, జనగామ జిల్లాకు చెందిన తరిగొప్పుల మండలం, సోలిపురం గ్రామానికి చెందిన చేవిటి అర్జున్ (33) విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.

అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో..

విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి యలమంచిలి సుజనా చౌదరి నామినేషన్ దాఖలు చేశారు. జగ్గయ్యపేటలో టీడీపీ అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ (59) తరఫున మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, అలాగే, శ్రీరాం రాజగోపాల్ సతీమణి శ్రీదేవి (50) కూడా నామినేషన్ వేశారు. ఎస్సీ రిజర్వుడ్ తిరువూరులో వైసీపీ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు నామినేషన్ వేశారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం నుంచి దుగ్గిశెట్టి సుభాషిణి (43), మైలవరం నియోజకవర్గం నుంచి వల్లభనేని నాగ పవన్‌కుమార్ (34), నందిగామ నియోజకవర్గం నుంచి కొత్తపల్లి సుందరరావు (45) స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ వేశారు. నందిగామ నియోజకవర్గంలో తెలుగు రాజ్యాధికార సమితి తరఫున బి.శ్రీనివాసరావు (37) నామినేషన్ సమర్పించారు. బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ నుంచి కె.ప్రభుదాస్ (54) నామినేషన్ వేశారు. నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి నవీన్ అంబేడ్కర్ చింతమల నామినేషన్ వేశారు. తెలుగు రాజ్యాధికార పార్టీ తరఫున జి.రాంబాబు (30) నామినేషన్ దాఖలు చేశారు.

కృష్ణాజిల్లాలో..

కృష్ణాజిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ గురువారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. అనంతరం జిల్లాలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తున్నారు. గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవో కార్యాలయాల్లో గుడివాడ, పెనమలూరు నియోజకవర్గాల నుంచి పోటీచేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. అవనిగడ్డ, పామర్రు, పెడన, గన్నవరం తహసీల్దార్ కార్యాలయాల్లో రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను స్వీకరించేలా ఏర్పాట్లు చేశారు. ఈనెల 25వ తేదీ వరకు జిల్లాలోని రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఈనెల 26న పరిశీలన ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 29వ తేదీ వరకు గడువు ఇచ్చారు. మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థుల నామినేషన్లను కలెక్టర్ చాంబరులో కలెక్టర్ స్వీకరిస్తారు. కాగా, మంచి ముహూర్తం చూసుకుని అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. శుక్ర, శని, సోమవారం నాడు అధికసంఖ్యలో నామినేషన్లు పడే అవకాశాలున్నాయి.

ఐదు నామినేషన్లు

నామినేషన్ల స్వీకరణ తొలిరోజు జిల్లాలోని గన్నవరం, పామర్రు, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు, ఆయన భార్య యార్లగడ్డ జ్ఞానేశ్వరి నామినేషన్ దాఖలు చేశారు. పామర్రు నియోజకవర్గం (ఎస్సీ) టీడీపీ అభ్యర్థి వర్ల కుమార్‌రాజా నామినేషన్ వేశారు. మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పిరమిడ్ పార్టీ అభ్యర్థిగా వక్కలగడ్డ పావని నామినేషన్ వేశారు. మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి గురువారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. గుడివాడ, పెడన, అవనిగడ్డ, పెనమలూరు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కూడా గురువారం నామినేషన్లేమీ పడలేదని పేర్కొన్నారు.



నామినేషన్ పత్రాలను అందజేస్తున్న గన్నవరం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు

భారీ అగ్ని ప్రమాదం

దగ్ధమైన మెడికల్ గోడౌన్, వస్త్ర దుకాణం

- రూ.5 కోట్ల వరకూ ఆస్తినష్టం

వన్‌టౌన్, ఏప్రిల్ 18 : బందరురోడ్డుకు అనుసంధానంగా, ఠాగూర్ లైబ్రరీకి ఎదురుగా ఉన్న మెడికల్ గోడౌన్, వస్త్ర దుకాణంలో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా పై అంతస్తులో మంటలు చెలరేగాయి. దీంతో మెడికల్ గోడౌన్, వస్త్ర దుకాణం పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక దళం మంటలను ఆర్పేందుకు తీవ్రంగా ప్రయత్నించింది. దాదాపు ఐదు ఫైరింజన్లు మంటలను అదుపులోకి తెచ్చాయి. అదృష్టవశాత్తూ ఎవరికీ గాయాలు కాలేదు. సుమారు రూ.5 కోట్ల ఆస్తినష్టం జరిగిందని చెబుతున్నారు. కాగా, వ్యాపారవేత్త తొండెపు హనుమంతరావుకు చెందిన ఈ భవనంలో మందుల గోడౌన్, వస్త్ర దుకాణాలు నడుస్తున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





గోడౌన్ నుంచి భారీగా వస్తున్న పొగ (ఇన్‌సెట్‌లో) మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ముగ్గురూ ముగ్గురే..

జిల్లాలో ముగ్గురు ఆర్డీవోల అక్రమాలు

- డిప్యూటీ తహసీల్దార్ల బదిలీలకు అడ్డు
- ఆర్థిక విషయాలను చక్కబెట్టుకునేందుకే..
- తమపై అనుమానం రాకుండా తెరవెనుక పన్నాగాలు
- ఎన్నికల కమిషన్ ఆదేశాలు బేఖాతరు

గుడివాడ : జిల్లాలో ఎన్నికల కమిషన్ ఆదేశాలు పూర్తిస్థాయిలో అమలు కావట్లేదు. ఎన్నికల నేపథ్యంలో జిల్లాస్థాయి నుంచి తహసీల్దార్ కేడర్ వరకూ బదిలీలు నిర్వహించిన సంగతి తెలిసిందే. డిప్యూటీ తహసీల్దార్ల బదిలీలు అనివార్యం కాదని పేర్కొంటూనే ఒకేచోట మూడు లేదా నాలుగేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఎన్నికల విభాగ డిప్యూటీ తహసీల్దార్లను తప్పనిసరిగా బదిలీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. అయితే, జిల్లాలోని డిప్యూటీ తహసీల్దార్లు బదిలీ కాకుండా ముగ్గురు ఆర్డీవోలు చక్రం తిప్పారని సమాచారం.

ఎందుకిలా..?

జిల్లాలోని ఆ ముగ్గురు ఆర్డీవోలు మంచి మిత్రులు. వీరిది ఒకే మాట, ఒకే బాట. ఉయ్యూరు ఆర్డీవో అప్పటి జిల్లా కలెక్టర్ రాజాబాబుకు క్లాస్‌మేట్. దీంతో వారు ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగింది. అధికార పార్టీ నాయకుల అక్రమ మట్టి తోలకాలకు అడ్డుపడ్డారనే నెపంతో జిల్లాలో పలువురు వీఆర్వోలను రాత్రికి రాత్రి బదిలీ చేశారు వీరు. కాగా, ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించలేదని, అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే కారణంతో ఎన్నికల కమిషన్ కలెక్టర్ పి.రాజాబాబుపై బదిలీ వేటు వేసింది. దీంతో జిల్లాలోని ఆ ముగ్గురు ఆర్డీవోలు కంగుతిన్నారు. ఎక్కడ తమపై కూడా బదిలీ వేటు పడుతుందో అనే భయంతో కొత్త ఆలోచనకు తెరలేపారు. తమపై ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టకుండా జాగ్రత్తలు చేపట్టారు. అప్పటికే జిల్లాలో బందరు, గుడివాడ డివిజన్లలో నకిలీ పట్టాల రచ్చ జరుగుతోంది. ఈ వ్యవహారంలో బందరులో 11వ డివిజన్ వీఆర్వోను అక్కడి ఆర్డీవో సస్పెండ్ చేశారు. మాజీ మంత్రి పేర్ని నాని ఆదేశాలతో నకిలీ పట్టాల వ్యవహారంలో కిందిస్థాయి అధికారిని మాత్రమే బలి చేశారు. గుడివాడలో డెప్యుటేషన్‌పై ఉంటూ, మాజీ మంత్రి క్యాంపు కార్యాలయంలో పనిచూస్తూ, నకిలీ పట్టాల వ్యవహారంలో ప్రధాన పాత్రధారుడైన జూనియర్ అసిస్టెంట్‌ను నందివాడ నుంచి గుడివాడ ఆర్డీవో కార్యాలయానికి బదిలీ చేశారు. ఎమ్మెల్యే నాని ఆదేశాల మేరకే ఈ బదిలీ జరిగింది. దీనిని అడ్డుపెట్టుకుని తామేమి తప్పు చేయలేదనే భావనను రెవెన్యూ వర్గాల్లో సృష్టించేందుకు విశ్వప్రయత్నాలు చేశారు.

డిప్యూటీ తహసీల్దార్ల బదిలీలకు అడ్డు

ఇటీవల కాలంలో జిల్లాలో జరిగిన భూసేకరణ, పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ వంటి వ్యవహారాల్లో రెవెన్యూ ఉన్నతాధికారులకు భారీస్థాయిలో నగదు ముట్టిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఆయా వ్యవహారాల్లో కొందరు ఎన్నికల విభాగ డిప్యూటీ తహసీల్దార్ల ప్రమేయం ఉందని రెవెన్యూ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. జిల్లాలో ఒకేచోట మూడు నుంచి నాలుగేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలిచ్చింది. అయితే, అధికార పార్టీ ఆదేశాలతో ఈ డిప్యూటీ తహసీల్దార్ల బదిలీలను నిలుపుదల చేశారని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. కొత్తవారు వస్తే వ్యవహారాలు చక్కబెట్టడం కుదరదని ఆలోచించి అప్పటి కలెక్టర్ పి.రాజాబాబుపై ఒత్తిడి తెచ్చి, ఈ బదిలీ ప్రక్రియకు ఆ ఆర్డీవోలే బ్రేక్ వేయించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ, ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్న ఆర్డీవోలపై ఇప్పటికైనా ఎన్నికల కమిషన్ దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

నలుగురు మైనర్లకు విముక్తి

సీఎంపై రాయి దాడి ఘటనలో ప్రధాన నిందితుడికి రిమాండ్

- పోలీసుల అదుపులోనే దుర్గారావు

విజయవాడ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : సీఎం జగన్‌పై అజిత్‌సింగ్‌నగర్‌లోని వివేకానంద స్కూల్ వద్ద జరిగిన రాయి దాడి కేసులో పోలీసుల ఆదుపులో ఉన్న నలుగురు మైనర్లు ఎట్టకేలకు ఇళ్లకు చేరారు. ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడు వేముల సతీష్‌కుమార్‌తో పాటు నలుగురు మైనర్లను కొద్దిరోజుల క్రితం అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఇందులో ప్రధాన నిందితుడ్ని గురువారం మధ్యాహ్నం నుంచి కోర్టులో హాజరుపరిచారు. పోలీసుల అదుపులో ఉన్న మైనర్లపై న్యాయవాది అబ్దుల్ సలీం మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో సెర్చ్ వారెంట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కోర్టు అడ్వకేట్ కమిషనర్‌ను నియమించింది. ప్రధాన నిందితుడు సతీష్‌కుమార్‌ను రిమాండ్ పంపాక అతడితో పాటు అదుపులోకి తీసుకున్న మిగిలిన నలుగురు మైనర్లను ఇళ్లకు పంపారు. దీంతో వారి తల్లిదండ్రుల కళ్లలో ఆనందభాష్పాలు కనిపించాయి. మరో నిందితుడు వేముల దుర్గారావు ఇంకా పోలీసుల అదుపులోనే ఉన్నాడు. అతడిని ఏ2గా కేసులో చేర్చినట్టు సమాచారం.

తొలి అడుగు



ఈసారి ఎన్నికల్లో ప్రధాన పార్టీల నుంచి 10 కొత్త ముఖాలు

టీడీపీ నుంచి 4.. వైసీపీ నుంచి 5.. బీజేపీ నుంచి ఒకరు

ఈసారి బరిలో ఉన్న పదిమంది వారసులు



సింహాద్రి చంద్రశేఖర్




షేక్ ఆసిఫ్



ఉప్పాల రాము



పేర్ని కిట్టూ



ఎస్.తిరుపతిరావు



కేశినేని చిన్ని



వెనిగండ్ల రాము



కె.శ్రీనివాసరావు



వర్ల కుమార్‌రాజా



సుజనా చౌదరి

ఎన్నికల సమరంలో విజయం సాధించి ప్రజాప్రతినిధుల సభలో అడుగుపెట్టడమంటే అంత ఆషామాషీ కాదు. సమస్యలపై పోరాడాలి.. ప్రజల మనసు గెలవాలి.. కోట్లు ఖర్చుపెట్టాలి.. ఇంత చేసినా ఓటరు కరుణిస్తాడో లేదో అనుమానమే. ఎంపీ అనో, ఎమ్మెల్యే అనో పిలిపించుకునేందుకు ప్రస్తుత ఎన్నికల్లో తొలిసారిగా బరిలో నిలుస్తున్న అభ్యర్థులు తమ శక్తియుక్తుల్ని ఒడ్డి పోరాడుతున్నారు. గెలుపు జెండా ఎగరేయాలని తహతహలాడుతున్నారు. అందుకు మన జిల్లాలేం మినహాయింపు కాదు. ఈ ఎన్నికల్లో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నుంచి కొత్తవారు సై అంటున్నారు.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలోని 2 పార్లమెంట్, 14 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ప్రధాన పార్టీలైన టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి తరఫున, వైసీపీ తరఫున పోటీ చేస్తున్న వారిలో 10 మందికి ఇవే తొలి ఎన్నికలు. 2019 ఎన్నికల కంటే తొలి సారి పోటీచేసే వారి సంఖ్య ఈ ఎన్నికల్లో తక్కువగా ఉంది. గత ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ తరఫున ఎనిమిది మంది కొత్తవారికి అవకాశం కల్పించగా, జనసేన ఏకంగా 10 మంది అవకాశం ఇచ్చింది. 2019 ఎన్నికల్లో జనసేన విడిగా పోటీ చేయడంతో ఎక్కువ మంది కొత్త అభ్యర్థులకు అవకాశం కల్పించింది. ఈ ఎన్నికల్లో తొలిసారి పోటీ చేస్తున్న 10 మంది అభ్యర్థుల్లో వైసీపీకి చెందినవారు ఐదుగురు ఉన్నారు. టీడీపీ నుంచి నలుగురు, బీజేపీ నుంచి ఒకరు ఉన్నారు.

కొత్తవారు వీరే..

- వైసీపీ నుంచి తొలిసారి ఎన్నికల బరిలో ఉన్నవారిలో మచిలీపట్నం పార్లమెంట్ నుంచి సింహాద్రి చంద్రశేఖర్‌తో పాటు విజయవాడ పశ్చిమ నుంచి షేక్ ఆసిఫ్, మైలవరం నుంచి సర్నాల తిరుపతిరావు, మచిలీపట్నం నుంచి పేర్ని కిట్టు, పెడన నుంచి ఉప్పాల రాము ఉన్నారు.
- టీడీపీ నుంచి తొలిసారి పోటీ చేస్తున్న వారిలో విజయవాడ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తున్న కేశినేని చిన్నితో పాటు తిరువూరు నుంచి కొలికపూడి శ్రీనివాసరావు, పామర్రు నుంచి వర్లకుమార్ రాజా, గుడివాడ నుంచి వెనిగండ్ల రాము ఉన్నారు. ఇక బీజేపీ నుంచి సీనియర్ నాయకుడు సుజనా చౌదరి విజయవాడ పశ్చిమ నుంచి పోటీలో ఉన్నారు.

2019లో ఇలా..

గత ఎన్నికల్లో తొలిసారి పోటీ చేసిన వారిలో వైసీపీ నుంచి బొప్పన భవకుమార్ (విజయవాడ తూర్పు), యార్లగడ్డ వెంకట్రావు (గన్నవరం), కైలే అనిల్ (పామర్రు), దూలం నాగేశ్వరరావు (కైకలూరు) ఉన్నారు. వీరితో పాటు విజయవాడ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసిన ప్రముఖ పారిశ్రామికవేత్త పొట్లూరి వీర ప్రసాద్ (పీవీపీ)కీ అవే తొలి ఎన్నికలు. టీడీపీ నుంచి దేవినేని అవినాశ్ (గుడివాడ), షబానాఖాతూన్ (విజయవాడ పశ్చిమ), కాగిత కృష్ణప్రసాద్ (పెడన) ఉన్నారు. వీరిలో ఐదుగురు ఈసారి ఎన్నికల బరిలో కూడా ఉండగా, ముగ్గురు మాత్రం దూరంగా ఉన్నారు.

వారసులొచ్చారోచ్..

- ఈసారి ఎన్నికల్లో వారసుల జోరు ఎక్కువగా ఉంది. అటు టీడీపీ, ఇటు వైసీపీలోనూ వారసుల హవా కనిపిస్తోంది. మైలవరం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వసంత కృష్ణప్రసాద్ తండ్రి వసంత నాగేశ్వరరావు సీనియర్ నాయకుడు. ఎన్టీఆర్ ప్రభుత్వంలో హోంమంత్రిగా చేశారు. నందిగామ నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తంగిరాల సౌమ్య తండ్రి తంగిరాల ప్రభాకర్ రావు టీడీపీ ఎమ్మెల్యేగా చేశారు. పెడన నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కాగిత కృష్ణ ప్రసాద్ తండ్రి కాగిత వెంకట్రావు టీడీపీలో సీనియర్ నాయకుడిగా ఓ వెలుగు వెలిగారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, టీటీడీ బోర్డు చైర్మన్‌గా పనిచేశారు. మచిలీపట్నం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొల్లు రవీంద్ర మామ వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. ఈయన మామ నడకుదిటి నరసింహారావు చంద్రబాబు ప్రభుత్వంలో మంత్రిగా చేశారు. పామర్రు నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వర్ల కుమార్ రాజా సీనియర్ టీడీపీ నాయకుడు వర్ల రామయ్య తనయుడు. రామయ్య ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందలేకపోయారు. తన తనయుడి ద్వారా తన ఆశయాన్ని సాధించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అవనిగడ్డ నుంచి జనసేన అభ్యర్థిగా పోటీ చేస్తున్న మండలి బుద్ధప్రసాద్ తండ్రి మండలి వెంకట కృష్ణారావు వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. మండలి వెంకట కృష్ణారావు దివిసీమ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారు. కాంగ్రెస్ హయాంలో మంత్రిగా చేశారు. ఈయన సేవలకు మెచ్చి దివిసీమ ప్రజలు ఈయన్ను దివిసీమ గాంధీగా పిలుచుకుంటారు.
- ఇక వైసీపీ అభ్యర్థుల్లో విజయవాడ తూర్పు నుంచి పోటీ చేస్తున్న దేవినేని అవినాష్ తండ్రి దేవినేని నెహ్రూ రాజకీయ ప్రస్థానం టీడీపీ నుంచి మొదలైంది. ఎమ్మెల్యేగా చేసిన నెహ్రూ రాజకీయ వారసత్వాన్ని అవినాష్ కొనసాగిస్తున్నారు. మచిలీపట్నం నుంచి పోటీ చేస్తున్న పేర్ని కిట్టు తండ్రి పేర్ని నాని మంత్రిగా చేశారు. కిట్టు తాత పేర్ని కృష్ణమూర్తి కూడా ఎమ్మెల్యేగా చేశారు. పెడన నుంచి పోటీ చేస్తున్న ఉప్పాల రాము తండ్రి ఉప్పాల రాంప్రసాద్ సీనియర్ రాజకీయ నాయకుడు. మచిలీపట్నం పార్లమెంట్ నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సింహాద్రి చంద్రశేఖర్ తండ్రి సింహాద్రి సత్యనారాయణ రాజకీయ ప్రస్థానం టీడీపీ నుంచే మొదలైంది. దేవుడి మంత్రిగా పేరొందిన సింహాద్రి సత్యనారాయణ రాజకీయ వారసత్వాన్ని కొనసాగించే బాధ్యతను చంద్రశేఖర్ తీసుకున్నారు.



వెల్వడంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

మళ్లీ వైసీపీకి అధికారం ఇస్తే..
కరువులో పోటీ తప్పదు

- ప్రస్తుతం రాష్ట్రానికి అప్పు ఇచ్చేవారు లేరు!
- వెల్వడం ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

మైలవరంరూరల్, ఏప్రిల్ 18 : అసెంబ్లీలో 151 మంది వైసీపీ ఎమ్మెల్యేలు రావణసంతలా మారి అమరావతి అభివృద్ధిని చెడగొట్టి, మూడు రాజధానులంటూ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని మైలవరం ఎమ్మెల్యే, ఎన్డీయే కూటమి అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్ అన్నారు. వెల్వడంలోని టీడీపీనేత కోమటి సుధాకరరావు గృహంలో గురువారం సాయంత్రం కూటమి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ, ప్రస్తుతం సాగర్‌నీరు తెలంగాణ రాష్ట్రాన్ని దాటి మనప్రాంతానికి వచ్చే పరిస్థితి లేదన్నారు. టీడీపీ ప్రభుత్వంలో చింతలపూడి ప్రాజెక్టుకి రూ.4100 కోట్లు చంద్రబాబు ఖర్చు చేస్తే వైసీపీ ప్రభుత్వం ఒక్కరూపాయి ఖర్చు చేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. పశువులకు నీరు లేని పరిస్థితి దాపురించిందన్నారు. గ్రామాలలో దాహం కేకలు పెరిగాయన్నారు. ఈ ఐదేళ్లలో దశాబ్దాల కాలంనాటి ఎన్నో కంపెనీలు మూతబడ్డాయన్నారు. మరోసారి వైసీపీ అధికారంలోకి వస్తే మనం పోటీ పడేది బీహార్‌తో, ఒడిసాలతోనేని జోస్యం చెప్పారు. జగన్‌రెడ్డి పేదల బలహీనతను అడ్డంపెట్టుకొని రాష్ట్రాన్ని దివాలా తీశారన్నారు. వైసీపీ అధికారంలోకి రాకముందు 2లక్షల కోట్లు ఉన్న అప్పు సంక్షేమ పథకాల పేరుతో 13లక్షల కోట్లకు చేర్చారని విమర్శించారు. మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తే అప్పు ఇచ్చేవారు ఎవరూ లేరన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధులకు విలువ లేదని, వలంటీర్ తారకమంత్రం పరిస్థితి జగన్మోహనరెడ్డి తీసుకువచ్చారన్నారు. స్థానిక సమస్యలను ముఖ్యమంత్రికి చెప్పే పరిస్థితి లేదని చెప్పారు. ఐదేళ్లలో సీఎంను కలిసింది రెండు, మూడుసార్లు మాత్రమే అన్నారు. ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్నారై కోమటి జయరాం, తాతా పోతురాజు, విజయబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సారథి

కూటమి గెలుపునకు కలిసిరండి..

- యాదవుల ఆత్మీయ సమావేశంలో సారథి

గుడివాడ, ఏప్రిల్ 18 : ఐదేళ్ల వైసీపీ పాలనలో యాదవులతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారని, రాబోయే ఎన్నికల్లో బడుగు బలహీనవర్గాలు, ముఖ్యంగా యాదవ సంఘీయులు కూటమికి మద్దతుగా నిలవాలని మాజీ మంత్రి, నూజివీడు అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి కోరారు. గురువారం వీకేఆర్ అండ్ వీఎన్‌బీ కళాశాల ఆడిటోరియంలో నియోజకవర్గ యాదవ టీడీపీ ప్రజాప్రతినిధుల ఫోరం ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్ నెరుసు చింతయ్య అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా సారథి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదలకు సంక్షేమ పథకాలతో పాటు ఉపాధి అవసరమని జగన్ గుర్తించలేదన్నారు. దీంతో ప్రజల ఆర్థిక ఎదుగుదల ఆగిపోయిందన్నారు. అబద్ధాలను ప్రచారం చేయడంలో జగన్‌కు ఎవరూ సాటి రారన్నారు. యాదవుల ఆశీర్వాదంతోనే తాను ఈ స్థాయికి రాగలిగానన్నారు. గుడివాడలో టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము దెబ్బకు నాని గుండెల్లో రైళ్లు పరిగెత్తాయన్నారు. వెనిగండ్ల రాము మాట్లాడుతూ, గుడివాడ ప్రజల కష్టాలు, బాధలు అందరూ చూస్తున్నారన్నారు. నాని కుట్రలకు బీసీలు బలయ్యారన్నారు. కూటమి అధికారంలోకి రాగానే మున్సిపాల్టీ భవనానికి మాజీ ఎమ్మెల్యే కఠారి సత్యనారాయణరావు పేరుపెడతానని హామీ యిచ్చారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోయ శివాజీని ఘనంగా సత్కరించారు. శేరిగొల్వేపల్లి వైసీపీ ఎంపీటీసీ అంగడాల శ్రీరామాంజనేయులు మరో 25 కుటుంబాలు సారథి, వెనిగండ్ల సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో మచిలీపట్నం పార్లమెంట్ జనసేన అభ్యర్థి బాలశౌరి, రావి వెంకటేశ్వరరావు, పిన్నమనేని వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, యాదవులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న తంగిరాల సౌమ్య

సౌమ్య సమక్షంలో టీడీపీలోకి వలంటీర్లు

నందిగామ, ఏప్రిల్ 18 : ప్రభుత్వ విధానాలతో నలిగిపోయిన నలుగురు వాలంటీర్లు టీడీపీలో చేరారు. నారా చంద్రబాబునాయుడు ఇటీవల వలంటీర్ల వ్యవస్థను పటిష్ట పరచడమే కాక, రూ.10వేలు పారితోషం ఇస్తానని చేసిన ప్రకటనకు ఆకర్షితులై చందర్లపాడు మండలం కోనాయపాలెంకు చెందిన నలుగురు వలంటీర్లు సౌమ్య సమక్షంలో టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన మార్కపూడి సుమశ్రీ, రాయల అనూరాధ, షేక్ నాగుల్‌బీ, కలక విమల ఇటీవల తమ పదవులకు రాజీనామా చేశారు. చంద్రబాబు ఈ రాష్ట్రానికి ఎంతో అవసరమని, యువతకు చంద్రబాబు పాలనలో సముచిత గౌరవం దక్కుతుందని టీడీపీలో చేరుతున్నట్టు ప్రకటించారు. భవిష్యత్‌కు గ్యారెంటీ ఉండాలంటే చంద్రబాబు అధికారంలోకి రావాలని సూచించారు. వీరితో పాటు గ్రామానికి చెందిన మార్కపూడి జాన్‌కోటయ్య టీడీపీలో చేరారు. అనంతరం కూటమి అభ్యర్థి తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, చంద్రబాబు అధికారంలోకి రాగానే వలంటీర్లకు రూ.10వేలతో పాటు, పని భారం కూడా తగ్గిస్తారని చెప్పారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ అధ్యాపకుడు గంగవరపు వెంకటనరసింహారావు సౌమ్యను కలిసి మద్దతు తెలిపారు. నందిగామలో తన భవనాన్ని వైసీపీ కార్యాలయానికి అద్దెకు ఇచ్చాను తప్ప తాను ఆ పార్టీ కాదని చెప్పారు. రాజకీయాలకు దూరంగా ఉన్నా చంద్రబాబు పాలన రావాలని బలంగా ఆకాంక్షిస్తున్నానని చెప్పారు. సీనియర్ టీడీపీ నాయకుడు కోట వీరబాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు వాసిరెడ్డి ప్రసాద్, గుత్తికొండ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ నేతలకు పార్టీ కండువా కప్పుతున్న వెనిగండ్ల

వైసీపీకి వరుస షాక్‌లు

- టీడీపీలో చేరిన వార్డు ఇన్‌చార్జ్, 100 మంది యువత

గుడివాడ, ఏప్రిల్ 18 : అధికార పార్టీ నుంచి వలసలు కొనసాగుతున్నాయి. గురువారం స్థానిక ఏలూరురోడ్డులోని ప్రజావేదికలో వైసీపీ సీనియర్ నేతలు, 19వ వార్డు ఇన్‌చార్జ్ గణపతి సూర్యనారాయణ(సూర్యం) ఆధ్వర్యంలో 100మంది యువత టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము సమక్షంలో పార్టీలో చేరారు. తొలుత పట్టణంలో భారీర్యాలీగా సూర్యం, యువత ప్రజావేదికకు తరలివచ్చారు. గణపతి వెంకటరమణ, గణపతి శివ, కె.శివాజీ, కె.ప్రకాష్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు దింట్యాల రాంబాబు, గోకవరపు సునీల్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దిల్లీరావుకు నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న అర్జున్ చేవేటి, గుజ్జుల లలిత, పామర్రులో ఎన్నికల అధికారి శ్రీదేవికి నామినేషన్ పత్రం అందిస్తున్న వర్లకుమార్‌రాజా, తాతయ్య తరపున నామినేషన్ దాఖలు చేస్తున్న మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, టీడీపీ తరపున నామినేషన్ దాఖలు చేస్తున్న తాతయ్య సతీమణి శ్రీదేవి

నామినేషన్ల ప్రక్రియ షురూ..

కృష్ణలంక, ఏప్రిల్ 18 : సాధారణ ఎన్నికలు-2024లో భాగంగా విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి ఫారం-1 ఎన్నికల పబ్లిక్ నోటీస్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఎస్.దిల్లీరావు గురువారం ఉదయం విడుదల చేశారు. అనంతరం దిల్లీరావు మాట్లాడుతూ, ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా నామినేషన్లు స్వీకరించడం జరుగుతోందన్నారు. నామినేషన్ దాఖలుకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. గురువారం ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఈనెల 25 వరకు కొనసాగుతుందని, ప్రభుత్వ సెలవు దినాల్లో మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరించనున్నట్టు వెల్లడించారు. అభ్యర్థులు గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చని, రెండు నియోజకవర్గాల నుంచి నామినేషన్లను ఫైల్ చేయవచ్చన్నారు. నామినేషన్ల దాఖలు సమయంలో 100 మీటర్ల పరిధిలో మూడు వాహనాలు మాత్రమే అనుమతించబడతాయని, అభ్యర్థి సహా ఐదుగురిని కార్యాలయంలోకి అనుమతించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

తొలిరోజు 11 నామినేషన్లు

విజయవాడ పార్లమెంటు నియోజకవర్గంలో రెండు..

నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు సంబంధించి తొలిరోజు ఎన్టీఆర్ జిల్లాలో గురువారం ఇద్దరు వ్యక్తులు రెండేసి సెట్ల చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. కలెక్టర్, విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎస్.దిల్లీరావుకు నామినేషన్లు సమర్పించారు. సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (కమ్యూనిస్టు) పార్టీ నుంచి విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన గుజ్జుల లలిత (61) నామినేషన్ దాఖలు చేశారు. అదేవిధంగా స్వతంత్ర అభ్యర్థిగా తెలంగాణా రాష్ట్రం, జనగామ జిల్లా తరిగొప్పుల మండలం, సోలిపురం గ్రామానికి చెందిన అర్జున్ చేవేటి (33) నామినేషన్ దాఖలు చేశారు.



అందరి సహకారంతో శాసన సభకు.. : యార్లగడ్డ

గన్నవరం : నియోజకవర్గ ప్రజల సహకారంతో రానున్న ఎన్నికల్లో గెలిచి శాసనసభకు వెళతానన్న నమ్మకం తనకు ఉందని కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గురువారం స్థానిక మీడియాతో మాట్లాడుతూ, ఈ నెల 25వ తేదీన ప్రజలు నాయకులు, కార్యకర్తలతో కలిసి మళ్లీ నామినేషన్ వేస్తానని తెలిపారు. వైసీపీ శ్రేణులు కూడా తనను ఆదరించి ఓట్లు వేస్తారని బలంగా నమ్ముతున్నట్టు తెలిపారు. చంద్రబాబు నాయుడు కన్నీటికి, భువనమ్మ వేదనకు కారణమైన ఈ నియోజకవర్గంలో మహిళలు తనను ఆశీర్వదిస్తారని తెలిపారు. మహిళల ఆత్మ గౌరవం కాపాడాలన్నా, గన్నవరానికి పూర్వ వైభవం తీసుకురావాలన్నా టీడీపీ కూటమి అధికారంలోకి రావాలన్నారు. టీడీపీ నాయకులు జాస్తి వెంకటేశ్వరరావు, పొట్లూరి బసవరావు, గూడపాటి తులసీమోహన్, బచ్చుల బోస్, ఆళ్ల గోపాలకృష్ణ, గూడవల్లి నర్సయ్య, కొల్లా ఆనంద్, గొడ్డళ్ల చిన రామారావు, గుండపనేని ఉమా వరప్రసాద్, కెహెచ్ కోటేశ్వరరావు, పరుచూరి నరేష్, తగరం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం నియోజకవర్గంలో మూడు..

గన్నవరం : గన్నవరంలో తొలిరోజు మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు నామినేషన్ పత్రాన్ని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి గీతాంజలి శర్మకు అందజేశారు. గురువారం ఉదయం 11.21 గంటల సమయంలో రెండుసెట్లను దాఖలు చేశారు. డమ్మీ అభ్యర్థిగా యార్లగడ్డ సతీమణి జ్ఞానేశ్వరీ ఒక సెట్‌ను వేశారు.

జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఐదు..

జగ్గయ్యపేట : జగ్గయ్యపేటలో తొలిరోజు గురువారం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి.

తొలుత టీడీపీ అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) తరపున మాజీ మునిసిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, నియోజక వర్గ టీడీపీ సమన్వయ కమిటీ సభ్యులు నెట్టెం శివరాం, టీడీపీ మాజీ ఫ్లోర్‌లీడర్ యలమంచిలి రాఘవ, మాజీ వైస్‌చైర్మన్ నూకల కుమార్ రాజాలు అందజేశారు.

శ్రీరాం తాతయ్య సతీమణి శ్రీదేవి, మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు సతీమణి సూర్యకాంతంలతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. బీఎస్పీ తరపున కొదమల ప్రభుదాస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీఆర్ పుష్పరాజ్ తదితరులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు.

నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరపున చింతమల నవీన్ అంబేడ్కర్, తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ తరపున గుడిసె రాంబాబులు నామినేషన్లు వేసినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.వెంకటేశ్వర్లు తెలిపారు.

పామర్రు నియోజకవర్గంలో ఒకటి..

పామర్రు : నామినేషన్ల తొలిరోజున గురువారం ఉదయం పామర్రు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థిగా వర్ల కుమార్‌రాజా తొలి నామినేషన్ పత్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి బూసి శ్రీదేవికి అందజేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ బాధ్యుడు తాడిశెట్టినరేష్, టీడీపీ జిల్లా రైతుప్రధాన కార్యదర్శి వల్లూరిపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసం పార్టీశ్రేణులు
సైనికుల్లా పనిచేయాలి

- కార్యకర్తల సమావేశంలో బాలశౌరి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 18 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో బందరులో నిర్వహించిన ప్రజాగళం కార్యక్రమం విజయవంతమైందని, ఇదే స్ఫూర్తితో నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఉమ్మడి మచిలీపట్నం పార్లమెంటు కూటమి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి అన్నారు. స్థానిక హోటల్‌లో గురువారం రాత్రి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తల అవగాహన సదస్సులో బాలశౌరి మాట్లాడారు. ప్రజాగళం కార్యక్రమ స్ఫూర్తితో ఇంటింటికీ తిరిగి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సందేశాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేస్తూ కూటమి అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాలన్నారు. మచిలీపట్నం నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. అసెంబ్లీ అభ్యర్థి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, వైసీపీ పాలనలో మంత్రులుగా పనిచేసిన పేర్ని నాని, కొడాలి నాని దాచుకో దోచుకో తరహాలో ప్రజల బాగోగులు పట్టించుకోలేదన్నారు. సీఎం జగన్, పేర్ని నాని విధానాలు నచ్చకే వల్లభనేని బాలశౌరి జనసేన పార్టీలోకి వచ్చారని, రొండి కృష్ణయాదవ్, నాలి మాధవ, షేక్ జలీల్ వంటి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో టీడీపీలో, జనసేనలో చేరుతున్నారన్నారు. నగరంలో 50 డివిజన్లు, గ్రామాల్లో క్లస్టర్, డివిజన్ ఇన్‌చార్జిలు పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు.

చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు బందరు ప్రజలకు ఇచ్చిన వరాలతో పోర్టును అభివృద్ధి చేసేందుకు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. మైనారిటీలు, మత్స్యకారుల సంక్షేమం కోసం అధికారంలోకి వచ్చిన వెంటనే సబ్సిడీపై రుణాలు అందిస్తామన్నారు. జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణ మాట్లాడుతూ, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల్లో కలిసి పనిచేసి అభ్యర్థుల విజయానికి కృషి చేద్దామన్నారు.



టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొల్లు రవీంద్ర

ఎన్డీఏ కూటమితోనే అభివృద్ధి : రవీంద్ర

బందరు అభివృద్ధి ఎన్డీఏ కూటమితోనే సాధ్యమని మాజీ మంత్రి, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. గురువారం క్లస్టర్ ఇన్‌చార్జి లంకే శేషగిరి ఆధ్వర్యంలో బందరు మండలం తపసిపూడి, మంగినపూడి, తాళ్లపాలెం గ్రామాల్లో నిర్వహించిన 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. తపసిపూడిలో పలువురు యువకులు టీడీపీలో చేరారు. అనంతరం రవీంద్ర మాట్లాడుతూ, వైసీపీ పాలనతో విసిగిపోయిన జిల్లా ప్రజలు టీడీపీ, జనసేనలో చేరుతున్నారన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఆయన కోరారు.

పాత ఎడ్లంకను నదీ కోత నుంచి రక్షిస్తా

- మండలి సమక్షంలో 100మంది జనసేన, టీడీపీలో చేరిక

అవనిగడ్డ, ఏప్రిల్ 18 : కృష్ణానది గమనంలో మార్పుల కారణంగా పెద్ద ఎత్తున కోతకు గురవుతున్న పాత ఎడ్లంక గ్రామాన్ని కోత నుంచి రక్షించేందుకు చర్యలు తీసుకుంటానని, వారధి నిర్మాణం చేపడతానని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. గ్రామంలో 100 మందికిపైగా వైసీపీ నేతలు, యువత జనసేన, టీడీపీలో చేరారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేని విధంగా పాత ఎడ్లంక దీవి కోతకు గురవుతోందని, దీనికి ఇసుక, బుసక తవ్వకాలే కారణమన్నారు. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేసింది ఏమీలేదన్నారు.

వైసీపీ నుంచి టీడీపీ, జనసేనలో చేరిన యువత మండల పరిధిలోని పాతఎడ్లంక గ్రామం వద్ద వైసీపీని వీడి తెలుగుదేశం, జనసేన పార్టీల్లో పలువురు యువకులు చేరారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ సమక్షంలో సర్పంచ్ పాలేపు సామ్రాజ్యం, ఉపసర్పంచ్ నాగరాణి, ఇతర కార్యవర్గ సభ్యులు గ్రామానికి చెందిన వైసీపీ నేతలు పెద్ద సంఖ్యలో తెలుగుదేశం, జనసేన పార్టీల్లో చేరారు.

తీర గ్రామాల అభివృద్ధికి తొలి ప్రాధాన్యత

నియోజకవర్గ తీర ప్రాంత మత్స్యకార గ్రామాల సమగ్రాభివృద్ధికి తొలి ప్రాధాన్యతనిస్తానని బుద్ధప్రసాద్ అన్నారు. అవనిగడ్డలో మత్స్యకార నేత చిలకలపూడి పాపారావు కార్యాలయంలో గురువారం ఆత్మీయ సమ్మేళనంలో బుద్ధప్రసాద్ పాల్గొన్నారు. దివిసీమలోని అన్ని మత్స్యకార గ్రామాల్లో తుఫాన్ షెల్టర్లు, కమ్యూనిటీ హాళ్లను నిర్మించామని, కరకట్టను పునర్నిర్మించామని, అయితే గడిచిన ఐదేళ్లలో దివి ప్రాంతానికి రక్షణ కవచంగా ఉన్న సముద్రపు కరకట్ట, ఏటి కరకట్టలు పూర్తిగా ధ్వంసమైపోయినా వైసీపీ ప్రభుత్వం ఏలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



మత్స్యకారుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మండలి బుద్ధప్రసాద్

ఎమ్మెల్యే దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టండి

జనసేన పార్టీకి ఓటు వేస్తే అగ్రకులాల దౌర్జన్యాలు పెరిగిపోతాయని గ్రామాల్లో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చేస్తున్న ప్రచారాన్ని ప్రతీ ఒక్కరూ తిప్పికొట్టాలని కోరారు. ఈనెల 22వ తేదీన నామినేషన్ వేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యకార నేతలు చిలకలపూడి పాపారావు, లకనం నాగాంజనేయులు, బొమ్మిడి గణేష్, అంద్రాజు వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లతో వైసీపీ నేతల బలవంతపు రాజీనామాలు?

రాణిగారితోట, ఏప్రిల్ 18 : రాణిగారితోట 17వ డివిజన్‌కు చెందిన 40మంది వలంటీర్లను వైసీపీ నాయకులు బలవంతంగా రాజీనామాలు చేయించినట్టు తెలిసింది. డివిజన్ పరిధిలోని బాపనయ్యనగర్‌లో గురువారం వలంటీర్లతో వైసీపీ నాయకులు సమావేశం నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్‌తో పాటు పార్టీకి చెందిన పలువురు నాయకులు సమావేశం నిర్వహించి రాబోయే ఎన్నికల్లో వైసీపీ విజయం సాధిస్తుందని, ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాజీనామా చేసిన వలంటీర్లకు మంచి అవకాశాలు కల్పించడం జరుగుతుందని హితబోధ చేసినట్టు తెలిసింది.

రాజీనామా చేసిన వారికి ఆర్థికంగా చేయుత అందిస్తామని, రాజీనామా చేసి పార్టీ విజయానికి కృషి చేయాలని చెప్పడంతో పాటు మంచి విందుతో వారిని బలవంతంగా ఒప్పించినట్టు సమాచారం. ముఖ్యమంత్రిపై జరిగిన దాడికి మనస్తాపం చెంది తాము రాజీనామా చెసినట్టుగా చెప్పాలని హితబోధ చేసి వారి చేత రాజీనామాలు చేయించినట్టు తెలిసింది.

అయితే ఎన్నికల నియమావళి ప్రకారం సమావేశాలు నిర్వహించరాదని తెలిసినా వైసీపీ నాయకులు ఏవిధంగా సమావేశం నిర్వహించారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. సమావేశం నిర్వహించిన స్థల యజమాని కూడా ఇందుకు ఏవిధంగా అంగీకరించారని, దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఇతర పార్టీల నాయకులు కోరుతున్నారు.



నిత్యాన్నదాన పథకానికి రూ.10 లక్షల విరాళం

మోపిదేవి, ఏప్రిల్ 18 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి పామర్రు మండలం జమిగొల్వేపల్లి గ్రామానికి చెందిన పొట్లూరి గోపాలం సుబ్బయ్య జ్ఞాపకార్థం కేతినేని రత్నాకర రావు - లక్ష్మీ శమతకమణి రూ.10 లక్షలు విరాళంగా అందజేశారు. కుటుంబసమేతంగా గురువారం స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు విరాళం చెక్కును అందజేశారు.



అభయాంజనేయస్వామి ఆలయం వద్ద రాట ప్రతిష్ఠ

27 నుంచి హనుమజ్జయంతి

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 18 : స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 27 నుంచి జూన్ వరకు నిర్వహించనున్న 23వ హనుమజ్జయంతి ఉత్సవాలకు సంబంధించి గురువారం ఆలయం వెనుక భాగంలో ఉత్సవ పందిరి ముహూర్తం రాటను ప్రతిష్ఠించారు. ఈవో కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు, శృంగారం వెంకట శేషాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ కొండేటి కనకదుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రూ.1.60లక్షల తెలంగాణ మద్యం స్వాధీనం

వత్సవాయి, ఏప్రిల్ 18 : అక్రమంగా తరలిస్తున్న రూ.1.60 లక్షల విలువైన తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని నలుగురిపై కేసు నమోదు చేసినట్టు విజయవాడ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ సూపరింటెండెంట్ భార్గవ్ తెలిపారు. వత్సవాయికి చెందిన వల్లంకొండ రమణయ్యకు చెందిన వరి గడ్డివామిలో గ్రామానికి చెందిన రమణయ్యతో పాటు చీకటిమల్ల గోపి, ఎస్‌కె నాగుల్, వల్లంకొండ రమేష్‌లు తెలంగాణకు చెందిన మద్యం 1,190 సీసాలు అట్టపెట్టెల్లో పెట్టి గడ్డివామిలో డంప్ చేసినట్టు భార్గవ్ తెలిపారు. అక్రమంగా నిల్వ ఉంచిన సీసాలను స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ చీకటి వ్యాపారం చేస్తున్నట్టు తెలుస్తోంది. మద్యం సీసాలను తెలంగాణ నుంచి వత్సవాయికి తరలించి వైసీపీ పెద్దల ఆదేశానుసారం దాచినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.




నిందితులు, మద్యంతో ఎస్ఈబీ అధికారులు

ఎస్ఈబీ దాడులు

తిరువూరు, ఏప్రిల్ 18 : విస్సన్నపేట, ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లో ఎస్ఈబి అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. సీఐ పి.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గంపలగూడెం మండలం అమ్మిరెడ్డిగూడెంలో చప్పిడి కృష్ణకుమారి నుంచి ఐదు లీటర్ల నాటుసారా, నెమలిలో యాదాల జయరాజ్ నుంచి 15 తెలంగాణ మద్యం బాటిళ్లు, ఎ.కొండూరు మండలం గొల్లమంద లతండాలో బాణావత్ నుంచి 10 ఆంధ్ర మద్యం బాటిళ్లు, విస్సన్నపేట మండలం తాతకుంట్లలో సారాకేసులో పాత ముద్దాయి బాణావత్ అశోక్‌ను అదుపులోకి తీసుకొని కోర్టుకు తరలించడం జరిగిందని సీఐ వివరించారు. ఈ దాడుల్లో ఎస్ఈబి ఎస్సై జి.రఘు, జగ్గారావు, బీఎంపీపీ ఎస్సై కెఎండి ఆరీఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



బందరు బాద్‌షా ఎవరో!




మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గంలో బాలశౌరి, చంద్రశేఖర్ మధ్య వార్

రాష్ట్రంలో మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గానికి ప్రత్యేక ఉంది. మచిలీపట్నం కేంద్రంగా నాయకులు స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపారు. డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య, ముట్నూరి కృష్ణారావు, కోపల్లె హనుమంతరావు ఆంధ్రపత్రికను స్థాపించి అప్పట్లో ప్రజలను స్వాతంత్ర్య ఉద్యమంవైపు మళ్లేలా చేశారు. జాతీయ పతాకాన్ని రూపొందించిన పింగళి వెంకయ్య, పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లోనే ముఖ్యమంత్రి అయిన కీర్తిశేషులు నందమూరి తారకరామారావు, కమ్యూనిస్టు ఉద్దండుడు చంద్ర రాజేశ్వరరావు, నక్సల్‌బరీ ఉద్యమానికి ఊపిరి పోసిన కొండపల్లి సీతారామయ్య లాంటి ఎందరో మహామహులు నడయాడిన నేల మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం. ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, వైసీపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్ మధ్య ప్రచ్ఛన్న యుద్ధం నడుస్తోంది. ఈ పోరులో బందరు బాద్‌షాగా ఎవరిని ప్రజలు గెలిపిస్తారో చూద్దాం.

నియోజకవర్గ చరిత్ర ఇదీ..


మచిలీపట్నం పార్లమెంటు స్థానం 1952లో ఏర్పడింది. 1952లో సీపీఎం తరఫున సనకా బుచ్చికోటయ్య మచిలీపట్నం ఎంపీగా ఎన్నికయ్యారు. 1957లో మండలి వెంకటకృష్ణారావు కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీగా ఎన్నికయ్యారు. 1962లో మండల స్వామినాయుడు ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఎంపీగా ఎన్నికయ్యారు. 1967లో యార్లగడ్డ అంకినీడుప్రసాద్ (చల్లపల్లి రాజా), 1971లో మేడూరి నాగేశ్వరరావు, 1977, 1980లలో మాగంటి అంకినీడు, 1984, 1989లో కావూరి సాంబశివరావు, కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీలుగా గెలుపొందారు. 1991లో కొలుసు పెదరెడ్డయ్య టీడీపీ తరఫున ఎంపీగా గెలుపొందారు. అప్పట్లో కేంద్ర ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంటులో బలనిరూపణ సమయంలో ఆయన కాంగ్రెస్ పార్టీకి ఓటువేశారు. 1996లో కైకాల సత్యనారాయణ టీడీపీ తరఫున ఎంపీగా గెలుపొందారు. 1998లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున కావూరి సాంబశివరావు ఎన్నికయ్యారు. 1999లో అంబటి బ్రాహ్మణయ్య టీడీపీ తరఫున ఎంపీగా ఎన్నికయ్యారు. 2004లో బాడిగ రామకృష్ణ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీగా ఎన్నికయ్యారు. 2009, 2014లో జరిగిన ఎన్నికల్లో టీడీ పీ తరఫున కొనకళ్ల నారాయణరావు ఎంపీగా ఎన్నికయ్యారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ తరఫున వల్లభనేని బాలశౌరి ఎంపికయ్యారు. టీడీపీ ఆవిర్భవించిన 1983 తరువాత పదిసార్లు పార్లమెంటు స్థానానికి ఎన్నికలు జరగ్గా నాలుగుసార్లు టీడీపీ అభ్యర్థులు ఐదుసార్లు కాంగ్రెస్ అభ్యర్థులు, ఒకసారి వైసీపీ అభ్యర్థి ఇక్కడి నుంచి గెలుపొంది పార్లమెంటుకు వెళ్లారు.

- ఒకరు పారిశ్రామికవేత్త, మరొకరు డాక్టర్
- జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా వల్లభనేని బాలశౌరి
- వైసీపీ అభ్యర్థిగా తొలిసారి ఎన్నికల బరిలోకి సింహాద్రి చంద్రశేఖర్



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాల పునర్విభజన జరిగిన అనంతరం మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం పరిధి మొత్తం కృష్ణాజిల్లాగా పరిగణిస్తున్నారు. ఇక్కడ ఈసారి ఎన్నికలు రసవత్తరంగా మారనున్నాయి. ప్రస్తుతం వైసీపీ ఎంపీగా కొనసాగుతున్న వల్లభనేని బాలశౌరి ఆ పార్టీకి చెందిన అధిష్టానం, స్థానిక నాయకుల వైఖరితో విసిగిపోయి జనసేన పార్టీలో చేరారు. జనసేన పార్టీ తరఫున ఆయన ఎంపీగా పోటీలో ఉన్నారు. రెండు రోజుల క్రితం టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ కూటమి అభ్యర్థుల గెలుపుకోసం పెడన, మచిలీపట్నంలలో ప్రచారం చేశారు. దీంతో కూటమి నేతల్లో జోష్ కనిపిస్తోంది. సింహాద్రి సత్యనారాయణ కుమారుడు సింహాద్రి చంద్రశేఖర్ వైసీపీ తరఫున ఎంపీగా అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. హైదారాబాద్‌లో కేన్సర్ వైద్యుడిగా పేరొందిన ఆయన తొలిసారిగా ఎన్నికల గోదాలోకి దిగారు.

ప్రజా బలంతో బాలశౌరి



జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీలో ఉన్న వల్లభనేని బాలశౌరి ప్రస్తుతం మచిలీపట్నం ఎంపీగా ఉన్నారు. ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో చేసిన అభివృద్ధి పనులే తనను గెలిపిస్తాయనే ధీమాతో ఆయన ఉన్నారు.

- మచిలీపట్నం పోర్టుకు కేంద్ర ప్రభుత్వ సంస్థ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ.4వేల కోట్ల రుణాన్ని ఇప్పించారు. ప్రస్తుతం పోర్టు పనులు జరుగుతున్నాయి.
- మచిలీపట్నం మెడికల్ కళాశాలను రూ.550 కోట్లతో నిర్మిస్తున్నారు. ఎంపీ హోదాలో కేంద్ర ప్రభుత్వం నుంచి మెడికల్ కళాశాలకు అనుమతులు తీసుకురావడం, నిధులు మంజూరు చేయించడంలో వల్లభనేని కృషి చేశారు. ప్రస్తుతం మెడికల్ కళాశాల మొదటి సంవత్సరం తరగతులు జరుగుతున్నాయి.
- గుడివాడలో రెండు రైల్వే ఫ్లై ఓవర్‌ల నిర్మాణం కోసం రూ.326 కోట్ల నిధులను మంజూరు చేయించారు. వీటి పనులు పూర్తయ్యే దశలో ఉన్నాయి.
- అవనిగడ్డ నియోజకవర్గం ఎదురుమొండి దీవికి చేరుకునేందుకు రూ.150 కోట్లతో కృష్ణానదిపై వారధి నిర్మాణం చేసేందుకు నిధులు మంజూరు చేయించారు.
- గిలకలదిండి హార్బర్ పనులు రూ.330 కోట్లతో జరుగుతుండగా ఇందుకు కేంద్ర ప్రభుత్వం వాటా నిధులను మంజూరు చేయించడంలో ఎంపీ బాలశౌరి విశేష కృషి చేశారు.

సింహాద్రి తట్టుకునేనా?



హైదారాబాద్‌లో అంకాలజిస్ట్ (కేన్సర్ వైద్యుడు)గా పనిచేస్తున్న మచిలీపట్నం పార్లమెంటు నియోజవర్గ వైసీపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్ జిల్లా వాసులకు చిరపరితులు. తొలుత అవనిగడ్డ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆయన పేరును ప్రకటించారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఎంపీ అభ్యర్థిగా పేరును ప్రకటించి ఎన్నికల గోదాలోకి దింపారు. ఎంతో రాజకీయ అనుభవం ఉన్న ఎంపీ బాలశౌరినే రాజకీయంగా వైసీపీకి చెందిన శాసనసభ్యులు ఇబ్బందులపాలు చేశారు. రాజకీయ అనుభవంలేని సింహాద్రి చంద్రశేఖర్ వైసీపీ నాయకుల కుట్రలు, కుతంత్రాలకు ఎంతమేర తట్టుకుని నిలబడతారోననే చర్చ నడుస్తోంది.

నిరుద్యోగులకు దగా



ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తానని 2014 ఎన్నికల ప్రచారంలో జగన్ హామీ

- మేనిఫెస్టోలోనూ ప్రకటన ● గెలిచాక హామీలన్నీ హుళక్కి
- డీఎస్సీ లేక నిరుద్యోగుల ఆశలు ఆవిరి
- ఈ ఎన్నికల్లో బుద్ధి చెబుతామంటున్న నిరుద్యోగ యువత



'అధికారంలోకొచ్చాక ఏటా జాబ్‌క్యాలెండర్ ప్రకటిస్తా. నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తా' అని గత ఎన్నికలకుముందు పాదయాత్రలో హామీలు గుప్పించిన వైఎస్ జగన్ అధికారంలోకొచ్చాక హామీలన్నిటినీ చాపచుట్టేశారు. జాబ్ క్యాలెండర్‌పై మేనిఫెస్టోలోనూ ప్రకటించి అటకెక్కించారు. బీఈడీ, సెకండరీ గ్రేడ్ టీచర్స్ ట్రైనింగ్‌లో ఉత్తీర్ణులై, కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొంది డీఎస్సీ కోసం ఐదేళ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులు ఈ ఎన్నికల్లో ఓటుతో తామేంటో చూపుతాని హెచ్చరిస్తున్నారు. పీజీలు, బీఈడీ, ఎంఈడీలు చదివిన నిరుద్యోగులు చేతి వృత్తులకు పరిమితమవుతున్నారు. ఎంత చదువు చదువుకున్నా గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిని చేపడదామనుకునే యువత జీవితాల్లో వైసీపీ ప్రభుత్వ పాలన వెలుగులు నింపలేకపోయిందని ఆరోపిస్తున్నారు. బతుకుదెరువు కోసం ఏదో ఒక పని చేసుకుంటున్న యువతను ఆంధ్రజ్యోతి పలుకరించగా తమ మనోగతాన్ని బయటపెట్టారు. - మచిలీపట్నం టౌన్

ఓట్లు వేయించుకుని మోసం చేశారు



ప్రభుత్వం ఖాళీ టీచర్ల పోస్టులు భర్తీ చేయడం లేదు. నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వ ఆడుకుంటోంది. ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తామని, డీఎస్సీ ఇస్తామని నమ్మబలికి ఓట్లు వేయించుకున్నారు. గెలిచాక మోసం చేశారు. పాఠశాలల్లో టీచర్ల ఖాళీ పోస్టులు భర్తీ చేయకపోవడం వల్ల విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయి. ఎన్నికల ముందు హడావిడిగా డీఎస్సీ ప్రకటించారు. నోటిఫికేషన్‌లోని అక్రమాలపై కోర్టులో కేసులు వేశారు. నిరుద్యోగలకు డీఎస్సీ అందని ద్రాక్షపండులా మిగిలిపోయింది.

-కాగిత సాంబశివరావు, స్టేట్ కన్వీనర్, పీటీఎల్‌పి

ఉద్యోగాలు భర్తీ చేయకుండా ఉద్యోగ విరమణ వయస్సు పెంచారు



టీచర్ల పోస్టులు భర్తీ చేయకపోగా టీచర్లు, ఉద్యోగుల పదవీ విరమణ వయసు రెండేళ్లు పెంచేశారు. ఇలా నిరుద్యోగ యువత పొట్ట కొట్టారు. ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచడంతో కొన్ని ఖాళీ పోస్టులు ఏర్పడకుండా చేశారు. వేలల్లో ఫీజులు చెల్లించి కోచింగ్‌లు తీసుకున్నా నోటిఫికేషన్లు లేక నిరుద్యోగులు అప్పులబారిన పడ్డారు. పీజీలు, ఎంఈడీ, బీయిడీ చదువుకున్న నిరుద్యోగ యువత వ్యవసాయ కూలీలుగా మారిపోయారు. ఈ ఎన్నికల్లో ప్రభుత్వానికి బుద్ధి చెపుతాం.

- కూరేటి జగన్, నిరుద్యోగి

ప్రైవేటు టీచర్లు, లెక్చరర్లకు ఇచ్చిన హామీ నెరవేరలేదు



పాదయాత్రలో జగన్‌మోహనరెడ్డి ప్రైవేటు టీచర్లు, లెక్చరర్లకు ఉద్యోగాలిస్తామని చెప్పిన మాట నెరవేరలేదు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన మాటలు నెరవేరలేదు. ఉచిత హామీలిచ్చి ప్రైవేటు, టీచర్లు లెక్చరర్ల నుంచి ఓట్లు దండుకున్నారు. ఏ ఒక్క ప్రైవేటు టీచరు, లెక్చరర్‌కు మేలు చేయలేదు.

- బొక్కా అయ్యప్ప స్వామి, రాష్ట్ర కార్యదర్శి, ప్రైవేటు టీచర్స్ అసోసియేషన్





వెయ్.. చిందెయ్..!

విజయవాడ పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థి సుజనా చౌదరి గురువారం నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా నగరంలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ర్యాలీ చేపట్టాయి. ప్రదర్శనలో డప్పు కళాకారుల విన్యాసాలకు అనుగుణంగా మహిళలు జెండాలు చేతపట్టి చిందేశారు.

పసుపు జెండా చేతపట్టి.. ఏడాదంతా జనంలోనే..

మునగచర్లలో అందరినీ ఆకట్టుకుంటున్న ఓ పెద్దాయన అభిమానం



కార్యకర్త నుంచి నాయకుల దాకా పార్టీ నుంచి ఏదో ఒకటి ఆశిస్తుంటారు. ఒక అడుగు ముందుకేసి ఏదో ఒకటి అడుగుతుంటారు. కానీ ఆయన ఏ పదవీ ఆశించలేదు. ఏ కాంట్రాక్టూ అడగలేదు. ఏ పనీ కోరలేదు. పార్టీయే కొండంత ఆస్తి అనుకున్నాడు. పసుపు జెండా కప్పుకోవడమే పెద్ద పదవి తీసుకోవడంగా భావించాడు. పెద్దల మెప్పుతో పనిలేదు. రాజకీయ లబ్ధి అక్కర్లేదు. ఆర్థిక ప్రయోజనం అసలే వద్దనుకున్నాడు. తన మెడలో తెలుగుదేశం కండువా ధరించి 365 రోజులూ బైక్‌పై మైకు పెట్టుకొని పార్టీ గీతాలు వినిపిస్తూ వీధుల్లో తిరుగుతుంటాడు. ఆయనే ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం మునగచర్లకు చెందిన గంటా వెంకటప్పయ్య. ఈ పెద్దాయన తెలుగుదేశం పార్టీకి వీరాభిమాని. ఆయనకు అధినేతలతో పనిలేదు. ఎవరి మన్ననలూ అవసరం లేదు. తన పార్టీ ప్రజల్లో ఉండాలన్న సంకల్పమే ఆయన్ను నిరంతరం జనంలో ఉండేలా చేస్తోంది. నిత్యం ఏదో ఒక వీధిలో ఆయన బైక్‌పై తిరుగుతూ టీడీపీ పాటలు వినిపిస్తూ ఉన్నాడు.

'ఏ పదవీ ఆశించక.. ఆస్తులు కోల్పోయినా అండగ నిలిచారు.. మీ అందరి సహకారం.. మీ అభిమానం పార్టీకే మూల ధనం! తీర్చలేని రుణం!' అంటూ తెలుగుదేశం పార్టీకి చెందిన ఒక ఫేమస్ పాటను బహుశా వెంకటప్పయ్య వంటి అంకితభావం ఉన్న వ్యక్తులను చూసే కవి అందించి ఉంటాడని ప్రజలు అంటున్నారు. వెనుక రెండు ఓట్లు లేక పోయినా తెల్లచొక్కాలు ధరించి నేతల వద్ద చక్కర్లు కొడుతూ పబ్బం గడుపుకొనే వ్యక్తులున్న ఈ రోజుల్లో ఇటువంటి వారిని చూసి స్ఫూర్తి పొందాలని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.

- నందిగామ, ఆంధ్రజ్యోతి

నాటి పశ్చిమ కృష్ణా... నేటి ఎన్టీఆర్ జిల్లా

రాష్ట్ర పునర్విభజనలో భాగంగా నవ ఎన్టీఆర్ జిల్లా ఆవిర్భవించింది. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం ప్రాతిపదికన 'పశ్చిమ కృష్ణా'గా పిలవబడే ప్రాంతాన్ని కృష్ణాజిల్లాకు చెందిన మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు పేరుతో ఎన్టీఆర్ జిల్లాగా ఏప్రిల్ 3, 2022వ తేదీన ఏర్పాటు చేశారు. విజయవాడ నగరం ఎన్టీఆర్ జిల్లా పరిపాలనా కేంద్రంగా.. పాత విజయవాడ రెవెన్యూ డివిజన్‌తో పాటు కొత్తగా నందిగామ, తిరువూరు రెవెన్యూ డివిజన్లతో నూతన జిల్లా ఏర్పడింది.

- విజయవాడ పార్లమెంట్ ప్రాతిపదికగా ఆవిర్భావం
- విభజనతో భౌగోళిక, రాజకీయ చిక్కుముళ్లెన్నో..
- 1952లో ఏర్పడిన పార్లమెంట్ నియోజకవర్గం
- ఇప్పటి వరకు 17 సార్లు లోక్‌సభ ఎన్నికలు..
- కొత్త జిల్లా ఏర్పడిన తరువాత తొలి ఎన్నికలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ పార్లమెంట్ రాజకీయ ముఖచిత్రం ప్రాతిపదికనే నవ ఎన్టీఆర్ జిల్లా ముఖచిత్రం ఉంటుంది. నవ ఎన్టీఆర్ జిల్లా తూర్పున కృష్ణా, ఏలూరు జిల్లాలు, దక్షిణాన పల్నాడు, గుంటూరు జిల్లాలు, పశ్చిమాన తెలంగాణా రాష్ట్రానికి చెందిన సూర్యాపేట జిల్లా, ఉత్తరాన తెలంగాణా రాష్ట్రానికి చెందిన ఖమ్మం జిల్లా భౌగోళిక సరిహద్దులు. ఎన్టీఆర్ జిల్లా.. పల్నాడు, గుంటూరు జిల్లాలను కృష్ణానది సరిహద్దుగా ఉంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో పశ్చిమ కృష్ణాలో అంతర్భాగంగా ఉన్న నూజివీడు నియోజకవర్గం ప్రస్తుతం ఏలూరు జిల్లా పరిధిలోకి వెళ్లింది.

● నవ ఎన్టీఆర్ జిల్లాలో తొలి ఎన్నికలు

ఉమ్మడి కృష్ణాజిల్లాగా ఉన్నపుడు విజయవాడ పార్లమెంట్



నియోజకవర్గం 1952లో ఏర్పడింది. 1952 నుంచి 2019 వరకు 17 సార్లు ఎన్నికలు జరిగాయి. ప్రస్తుతం విజయవాడ పార్లమెంట్‌కు 18వ దఫా ఎన్నికలు జరుగుతున్నాయి. నవ ఎన్టీఆర్ జిల్లాగా ఏర్పడిన తర్వాత మొదటిసారి సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లా ఆవిర్భవించిన 2024 ఏప్రిల్ 4 నాటికి రెండేళ్లు పూర్తి చేసుకుంది. కొత్త జిల్లాగా ఏర్పడిన రెండేళ్లకు ఎన్టీఆర్ జిల్లాకు ఎన్నికలు రావటం గమనార్హం.

● విభజనతో నెలకొన్న చిక్కుముడులు

ఎన్టీఆర్ జిల్లాగా ఏర్పడిన తరుణంలో పలు చిక్కుముడులు కూడా నెలకొన్నాయి. ఎన్టీఆర్ జిల్లా కేంద్రం విజయవాడలో గ్రేటర్ విలీన ప్రతిపాదిత ప్రాంతాలైన గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలు ప్రస్తుతం కృష్ణాజిల్లాలో కొనసాగుతున్నాయి. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం కృష్ణాజిల్లా గన్నవరంలో ఉంది. విమానాశ్రయం విజయవాడది. ఉండేది కృష్ణాజిల్లాలో. 68 కిలోమీటర్ల దూరంలో ఉన్న మచిలీపట్నం నుంచి వచ్చి ప్రోటోకాల్ చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. విజయవాడను ఆనుకుని ఉన్న పెనమలూరు ప్రజలు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న బందరుకు వెళ్లాల్సి వస్తోంది. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో నియోజకవర్గాలు విడివడినప్పటికీ.. కృష్ణాజిల్లా పరిధిలోని గన్నవరం నియోజకవర్గంలోని విజయవాడ మండలానికి చెందిన 16 గ్రామాలు ఎన్టీఆర్ జిల్లాలో అంతర్భాగంగా ఉన్నాయి. ఈ 16 గ్రామాల్లో 7 గ్రామాలు ఎన్టీఆర్ జిల్లాలోని మైలవరం నియోజకవర్గం పరిధిలోకి, 9 గ్రామాలు కృష్ణాజిల్లాలోని గన్నవరం నియోజకవర్గం పరిధిలోకి వస్తాయి. జడ్పీ కొలువు తీరిన తర్వాత కాలంలో ఎన్నికలు జరగటంతో ప్రస్తుతం ఉమ్మడి జడ్పీగానే కొనసాగుతోంది. ఎన్టీఆర్ జిల్లా పరిధిలో 16 మండల పరిషత్తులు ఉన్నాయి. ఇవన్నీ ప్రస్తుతం ఉమ్మడి కృష్ణా జిల్లా జడ్పీ పరిధిలో ఉన్నాయి.

● మహిళా ఓటర్లే అధికం

తుది ఓటర్ల జాబితా ప్రకారంలో ఎన్టీఆర్ జిల్లాలో 16,74,995 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా మహిళా ఓటర్లు 8,57,361 మంది ఉంటే.. పురుష ఓటర్లు 8,17,484 మంది ఉన్నారు. థర్డ్‌జెండర్ ఓటర్లు 150 మంది ఉన్నారు. సర్వీసు ఓటర్లు 386 మంది ఉన్నారు.

ఎన్టీఆర్ జిల్లా ముఖచిత్రం

జిల్లా భౌగోళిక స్వరూపం : 3315 చదరపు కిలోమీటర్లు
పార్లమెంట్ నియోజకవర్గం : విజయవాడ
అసెంబ్లీ నియోజకవర్గాలు : తిరువూరు, మైలవరం, విజయవాడ తూర్పు, పశ్చిమ, సెంట్రల్, నందిగామ, జగ్గయ్యపేట, **రెవెన్యూ డివిజన్లు :** విజయవాడ, నందిగామ, తిరువూరు, **రెవెన్యూ మండలాలు :** 20, **మండల పరిషత్‌లు :** 16, **మునిసిపాలిటీలు / నగర పంచాయతీలు :** 5, **కార్పొరేషన్లు :** 1, **రెవెన్యూ గ్రామాలు :** 321, **నివాసితంకాని గ్రామాలు :** 16, **గ్రామ పంచాయతీలు :** 288, జనాభా (2011 సెన్సస్) : 22.18 లక్షలు
పురుషులు : 11.14 లక్షలు, **మహిళలు :** 11.04 లక్షలు
లింగ నిష్పత్తి : ప్రతి 1000 మంది



ఏపీసీపీడీసీఎల్ సీఎండీ కోడ్ ఉల్లంఘించారని ఈసీకి ఫిర్యాదు

పెనమలూరు, ఏప్రిల్ 18: ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా కానూరు ఏపీసీపీడీసీఎల్ విద్యుత్ డీఈఈ(ఆపరేషన్స్)గా బి.నవీన్‌కుమార్ ఈనెల ఆరున బదిలీపై వచ్చారని, బదిలీ వ్యవహారంలో ఏపీసీపీడీసీఎల్ సంస్థ సీఎం డీ కె.సంతోష్‌రావు ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని చర్యలు తీసుకోవాలని పెనమలూరుకు చెందిన కొంత మంది ఓటర్లు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ శాఖల అధికారుల మార్పులు, చేర్పులు ఎన్నికల కమిషన్ పరిధిలోనే జరుగుతాయని పేర్కొన్నారు. కానీ ఆ బదిలీలో సీఎండీ కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారని, అది స్పష్టంగా కనిపిస్తోందని వారు పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలను డీఈఈ నవీన్‌కుమార్ ప్రభావితం చేసే అవకాశం ఉందని వారు ఆరోపించారు. ఈసీ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.15

టీడీపీ ప్రభుత్వంలోనే బీసీలకు రక్షణ



టీడీపీ ప్రసాదంపాడు కార్యాలయంలో నిర్వహించిన జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న దొంతు చిన్నా

గుణదల, ఏప్రిల్ 18: టీడీపీ ప్రభుత్వంలోనే బీసీలకు రక్షణ ఉంటుందని ఆ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు దొంతు చిన్నా అన్నారు. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులోని టీడీపీ కార్యాలయంలో జయహో బీసీ సదస్సును గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చిన్నా మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీ కార్పొరేషన్‌ను రద్దు చేసి బీసీలకు ఎంతో అన్యాయం చేసిందన్నారు. చంద్రబాబు బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు రుణాలు మంజూరు చేసేవారని ఆయన తెలిపారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి వస్తే మహిళలకు రక్షణ కల్పిస్తుందని, బీసీలకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. బీసీలు ఐక్యమత్యంగా ఉండి వైసీపీని తరిమి కొట్టేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు గొడ్డళ్ల చినరామారావు, నబిగాని కొండ, అద్దేపల్లి సాంబ శివనాగరాజు, పట్టపు చంటి, జె.శ్రీనివాసరావు, బి.అరుణాబి, టి.శివలీల, అంజిబాబు, రామకృష్ణంరాజు, పుణ్యవతి, భరత్, వర్మ పాల్గొన్నారు.



బాపులపాడులో ఇంటింటికి ప్రజాగళం ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 18: రాష్ట్రంలో అరాచకపాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు రానున్న ఎన్నికల్లో చరమగీతం పాడి కూటమిని అధికారంలోకి తీసుకువస్తే చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు ప్రజలకు వివరించారు. గురువారం బాపులపాడులో టీడీపీ జంక్షన్ పట్టణ అధ్యక్షుడు ఆట్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంటింటికి ప్రజాగళం ప్రచార కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. టీడీపీ-బీజేపీ-జనసేన ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుకు ప్రజలు మద్దతు పలకాలని కోరారు. గ్రామంలోని కేఎస్ టాకీస్ ప్రాంతంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు రూపొందించిన సూపర్ సిక్స్ పథకాలు, నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావును గెలిపించాలని ప్రచారం చేశారు. నాయకులు వీరమాచనేని సత్యప్రసాద్, వడ్డిల్లి లక్ష్మి, గార్లపాటి రాజేశ్వరరావు, చిన్నాల లక్ష్మీనారాయణ, చెరుకూరి హరికృష్ణ, కడవకొల్లు రాజేష్, కడవకొల్లు నాగరాజు, గుమ్మడి శేషగిరిరావు, లంక శివ, యలమంచలి వెంకటేశ్వరారవు, బీజేపీ నాయకుడు తోట మురళీధర్, జనసేన నాయకుడు సమీర్ తదితరులు పాల్గొన్నారు.



కంకిపాడులో సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంచుతున్న పులి శ్రీనివాసరావు తదితరులు

టీడీపీ గెలుపే లక్ష్యం

కంకిపాడు, ఏప్రిల్ 18: వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు విసుగెత్తి ఉన్నారని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా పని చేద్దామని నాయకులు, కార్యకర్తలకు ఆ పార్టీ కంకిపాడు యూనిట్ ఇన్‌చార్జి పులి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. కంకిపాడులో గురువారం నిర్వహించిన సూపర్ సిక్స్ పథకాల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు చలవాది రాజు, వణుకూరు విక్రం, అన్నవరపు శివపార్వతి, బొర్రా వెంకట్, కిల్లీల శ్రీను, జమలయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

21 మంది వలంటీర్ల రాజీనామా

ఉయ్యూరు, ఏప్రిల్ 18: పెద ఓగిరాలకు చెందిన 21 మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. గ్రామ సచివాలయ పరిధిలో 22 మంది వలంటీర్లకు 21 మంది రాజీనామా చేసి, పత్రాలు అందజేసినట్టు ఎంపీడీవో జి.లక్ష్మీదేవి తెలిపారు. స్థానిక అధికారపార్టీ నాయకుల ఒత్తిడి కారణంగా వలంటీర్లు రాజీనామా చేసినట్టు సమాచారం.

నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తా

● ఓటర్లకు యార్లగడ్డ వెంకట్రావు హామీ



ప్రసాదంపాడు వగరాల బజారులో ఎన్నికల ప్రచారం చేస్తున్న యార్లగడ్డ వెంకట్రావు

గుణదల, ఏప్రిల్ 18: నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తానని, గన్నవరం నుంచి తనను శాసనసభకు పంపాలని నియోజకవర్గ ఓటర్లను టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ప్రసాదంపాడు గ్రామంలోని నగరాల వీధిలో గురువారం ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. తాను గెలిచాక చేయనున్న అభివృద్ధిని స్థానికులకు వివరించారు. నిరుద్యోగ యువతకు స్థానికంగానే ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తానని, మల్లవల్లి, వీరపనేనిగూడెం పారిశ్రామికవాడలను అభివృద్ధి చేసి, పూర్తిస్థాయిలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. మల్లవల్లి పారిశ్రామికవాడలో పూర్తిస్థాయి పరిశ్రమలు ఏర్పాటైతే 15వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. ప్రచారంలో భాగంగా ఇంటింటికి వస్తున్న యార్లగడ్డ వెంకట్రావుకు అడుగడుగునా మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. మచిలీపట్నం ఎంపీగా బాలశౌరిని, గన్నవరం ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గూడవల్లి నరసయ్య, సర్నాల బాలాజీ, బొప్పన హరి కృష్ణ, విజ్జి రామారావు, పొలిమెట్ల రమణ, చెల్లా రాము, అప్పుడు, బాషా, యోగేశ్వరావు, భూషణం, కొలకలూరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బొమ్ములూరులో ఇంటింటిప్రచారం చేస్తున్న యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్, టీడీపీ, జనసేన నాయకులు

లని ప్రజలను కోరారు. టీడీపీ నేతలు వేగే కృష్ణారావు, గొల్లపూడి ప్రసాదరావు, దయాల రాజేశ్వరరావు, మూల్పూరి సాయికల్యాణి, కాటూరి విజయభాస్కర్, గండేపూడి నితీష్‌కుమార్, మాతంగి వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు వడ్డి శివనాగేశ్వరరావు, సింగవరపు సూర్యావతి, గరికపాటి రమేష్, యర్రంశెట్టి బాబి, దాసరి రాజేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే: యార్లగడ్డ సతీష్

హనుమాన్‌జంక్షన్‌రూరల్: టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన సాధ్యమని యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్ అన్నారు. బొమ్ములూరులో టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. కూటమి అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాల ద్వారా ప్రజలకు అందే లబ్ధిని ఆయన వివరించారు. సూపర్‌సిక్స్ పథకాలు, యార్లగడ్డ నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టిన కార్యాచరణ కరపత్రాలను ప్రజలకు అందజేశారు. వైసీపీ ప్రభుత్వం పంచాయతీ నిధులను దారి మళ్లించడంతో గ్రామంలో నాలుగేళ్ల నుంచి అభివృద్ధి లేదన్నారు. మౌలిక సదుపాయాలైన డ్రెయినేజీ, వాటర్ ట్యాంకులను కూడా నిర్మించలేదన్నారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి, వైసీపీ అరాచకపాలనను బేరీజు వేసుకుని కూటమి గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావుకు సైకిల్ గుర్తుపై, బందరు పార్లమెంట్ అభ్యర్థి బాలశౌరికి గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీ గెలిపించా

వెంకట్రావు గెలుపు గన్నవరం అభివృద్ధికి మలుపు



నామినేషన్ వేయడానికి వెళుతున్న యార్లగడ్డ వెంకట్రావును ఆశీర్వదిస్తున్న ఆళ్ల గోపాలకృష్ణ

గన్నవరం: రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు గెలుపు గన్నవరం నియోజకవర్గ అభివృద్ధికి మలుపు అని సాగునీటి వినియోగదారుల సంఘాల సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. యార్లగడ్డ వెంకట్రావు ఘన విజయం సాధించాలని హనుమాన్‌జంక్షన్ అభయాంజనేస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నామినేషన్ సందర్భంగా స్వామి శేషవస్త్రాన్ని వెంకట్రావుకు ఇచ్చి అక్షింతలు వేసి ఆయన ఆశీర్వదించారు. సూపర్ సిక్స్ పథకాల అమలు, బ్రహ్మయ్యలింగం చెరువును రిజర్వాయర్ చేసి సాగు, తాగునీరు అందించడం, పలు గ్రామాల్లో ఏలూరు కాలువపై వంతెనల నిర్మాణానికి యార్లగడ్డ ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. అర్హులైన 15వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి యువతకు ఉపాధి కల్పిస్తారని తెలిపారు. పోలవరం కుడికాలువ నుంచి ఏలూరు కాలువ నీటిని అనుసంధానం చేస్తారని తెలిపారు. యార్లగడ్డ వెంకట్రావును నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించి శాసన సభకు పంపాలని కోరారు.



యనమలకుదురులో టీడీపీ నేతలతో కలిసి శంఖారావం కార్యక్రమంలో పాల్గొన్న బోడె వైష్ణవి

తాడిగడప మునిసిపాలిటీలో
అభివృద్ధి శూన్యం: బోడె వైష్ణవి

పెనమలూరు, ఏప్రిల్ 18: తాడిగడప మునిసిపాలిటీ ఏర్పడి మూడేళ్లయినా ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమయిందని బోడె ప్రసాద్ కుమార్తె వైష్ణవి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం యనమలకుదురులో నిర్వహించిన శంఖారావం పాదయాత్రలో ఆమె స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. యనమలకుదురు, తాడిగడప, కానూరు, పోరంకిలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగు రోడ్లపైకి వచ్చి దుర్గంధం వెదజల్లుతోందని అన్నారు. దీంతో దోమల విజృంభిస్తున్నాయని స్థానికులు రోగాల బారిన పడుతున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను పట్టించుకోకుండా జగన్‌రెడ్డి ఉత్తుత్తి బటన్ నొక్కుతూ ప్రజలను మభ్యపెడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు బోడె ప్రసాద్‌ను ఎమ్మెల్యేగా, బాలశౌరిని ఎంపీగా, చంద్రబాబును ముఖ్యమంత్రిగా ఎన్నుకుందామని, రాష్ట్రాన్ని బాగు చేసుకుందామని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతనేని ఆజాద్, మొక్కపాటి శ్రీనివాస్, శొంఠి శివరాంప్రసాద్, వీరంకి కుటుంబరావు, పాదాల ప్రభాకర్, సింగం సుబ్రహ్మణ్యం, బలగం నాగరాజు, వీరంకి నంది, మల్లంపాటి విజయలక్ష్మి, పండల రజిని, షాహీనా, తమ్ము అశోక్, బెజవాడ వెంకటేష్, ఇబ్రహీం, గోగినేని రామారావు పాల్గొన్నారు.

పశువుల్లో వ్యాధులపై
అప్రమత్తత అవసరం

ఉంగుటూరు, ఏప్రిల్ 18: వేసవిలో పశువులకు వచ్చే వ్యాధులపట్ల పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని గన్నవరం ఎన్టీఆర్ పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పీవీఎస్ కిషోర్ సూచించారు. సకాలంలో సరైన చికిత్స అందించడం ద్వారా పశుపోషణ లాభసాటిగా మారుతుందన్నారు. ఎండ వేడిమికి పాడిపశువుల్లో పాలదిగుబడులు తగ్గకుండా పచ్చిమేత, తాగునీరు దాణామిశ్రమాలను పుష్కలంగా అందించాలని ఆయన సూచించారు. పెదఅవుటపల్లిలో ఎన్టీఆర్ పశువైద్య కళాశాల, పశుసంవర్ధకశాఖ సంయుక్త అధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్యశిబిరాన్ని అల్లాపురం ప్రాంతీయపశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ రాధాకృష్ణతో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. సీజనల్‌గా పశువులకు సంక్రమించే వ్యాధులు, నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. 56 పశువులకు గర్భకోశ వ్యాధులకు, 20 గేదెలకు సాధారణ వ్యాధులకు చికిత్స అందించడంతోపాటు, 35 పశువులకు నట్టల నివారణ మందులు అందజేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ ఎన్.లక్ష్మీరాణి, డాక్టర్ డి.శ్రీనివాస్‌కుమార్, డాక్టర్ ఎం.మల్లికార్జునరావు, డాక్టర్ ఐ.వసంత, కళాశాల బోధనా సిబ్బంది, డాక్టర్ ఎం.శ్రీనివాస్, డాక్టర్ రమేష్, డాక్టర్ వాణి, పశువైద్యులు డాక్టర్ నాగార్జున, డాక్టర్ సుధీర్ పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

ఉయ్యూరు, ఏప్రిల్ 18: పెద ఓగిరాల కోదండ రామస్వామి మందిరం ఆధ్వర్యంలో గురువారం భారీ అన్న సమారాధనను గ్రామ సర్పంచ్ త్రిపురం లక్ష్మి గురువారం ప్రారంభించారు. శ్రీరామనవమి సందర్భంగా రెండురోజులపాటు స్వామికి పూజలు చేసి అనంతరం అన్న సమారాధన చేశారు.

నేడు బోడె ప్రసాద్ నామినేషన్

పెనమలూరు, ఏప్రిల్ 18: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పెనమలూరు అభ్యర్థి బోడె ప్రసాద్ శుక్రవారం తన నామినేషన్ దాఖలు చేయనున్నారు. పోరంకి టీడీపీ కార్యాలయం నుంచి ఉదయం తొమ్మిది గంటలకు పాదయాత్రగా బయలుదేరి పెనమలూరు తహసీల్దారు కార్యాలయంలో తన నామినేషన్ దాఖలు చేయనున్నారు. కార్యక్రమానికి అభిమానులు, కూటమి నేతలు, పార్టీల శ్రేణులు కావాలని బోడె ప్రసాద్ పిలుపునిచ్చారు. నామినేషన్ కార్యక్రమానికి కూటమి ఎంపీ అభ్యర్థి బాలశౌరి, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, వైవీబీ రాజేంద్రప్రసాద్, బుద్దా వెంకన్న, కొలుసు పార్థసారథి, ముప్పా రాజా, ఏకుల విజయేంద్ర హాజరవుతారని తెలిపారు.

నామినేషన్‌కు భారీగా తరలిరండి: తుమ్మలపల్లి హరికృష్ణ

కంకిపాడు: టీడీపీ పెనమలూరు నియోజకవర్గ అభ్యర్థిగా శుక్రవారం ఉదయం 10 గంటలకు బోడె ప్రసాద్ నామినేషన్ వేస్తున్నారని, ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు తుమ్మలపల్లి హరికృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. ఉదయం పోరంకిలోని పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేస్తారని, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని ఆయన కోరారు. టీడీపీ నాయకులు పులి శ్రీనివాసరావు, ఏనుగ జయప్రకాష్, షేక్ బాజి పాల్గొన్నారు.

ఆర్‌యూబీ పనులు ప్రారంభం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 18: నిత్యం రద్దీగా ఉండే విజయవాడ-విశాఖపట్నం రైల్వే మార్గంలోని ఎల్‌సీ నెం.334 వద్ద ఆర్‌యూబీ నిర్మాణపనులు గురువారం ప్రారంభమయ్యాయి. కొన్నేళ్లుగా వేలేరు గ్రామస్థులు ఎదురుచూస్తున్న ఆర్‌యూబీ నిర్మాణ పనులు ఎట్టకేలకు మొదలయ్యాయి. వేలేరు గ్రామస్థులతో కలిసి అవిర్నేని కార్తీక్, కాంతారావు తదితరుల విజ్ఞప్తి మేరకు 13వతేదీన ఆర్‌యూబీ నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన రైల్వే ఏడీఎం నిర్మాణ పనులు త్వరితగతిన మొదలు పెట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు.



బాపులపాడు హైస్కూల్‌లో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది


అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 18: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక అగ్నిమాపకాధికారి రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మారుతీ గ్యాస్ గోడౌన్ వద్ద సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరిగి నపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటి ప్రమాదాల్లో తీసుకోవాల్సి జాగ్రత్తలు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం. నాగేశ్వరరావు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీరవల్లి పీహెచ్‌సీ ఆవరణలో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వేసవి వేడితో పాటు వ్యక్తిగత నిర్లక్ష్యం వల్ల అగ్నిప్రమాదాలు జరుగుతాయని, అప్రమత్తతోనే వాటిని నివారించవచ్చని ఫైర్ ఆఫీసర్ జి.రామ్మోహనరావు అన్నారు. వీరవల్లి పీహెచ్‌సీ ఆవరణలో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం అగ్నిప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు, వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. పరిసరాల్లో చెత్త లేకుండా జాగ్రత్తపడాలని ప్రమాదం జరిగిన వెంటనే 101కు ఫోన్ చేసి సమాచారమందించాలని ఆయన సూచించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ సంజీవ్ కుమార్, డీవోపీ సాంబశివరావు, ఫైర్‌మెన్ మురళి, శ్యాంబాబు పాల్గొన్నారు.

నేడే చూడండి
కంకిపాడు :
శ్రీవిజయలక్ష్మీ టాకీస్
2K 3D A/C dts



రోజూ 4 ఆటలు :
11-30AM, 02-45PM
06-30PM, 09-45PM

సాయిబాబా మందిరంలో
ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 18: స్థానిక బాపులపాడు ఐటీఐ రోడ్డులోని షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బాబాకు అభిషేకాలు అర్చ నలు, భజనలు జరిపారు. రేమల్లె గ్రామానికి చెందిన దాత యనమదల కృష్ణారావు 500 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. గ్రామంలో బాబాకు పల్లకీ సేవ జరిపారు.

నేడే విడుదల



విజయవాడ : అలంకార్	విజయవాడ : వెంకటేశ్వరప్యాలెస్
బెంజిసర్కిల్ : క్యాపిటల్‌సినిమాస్	లబ్బీపేట : పివిపి సినీపోలీస్
లబ్బీపేట : పివిఆర్ సినిమాస్	ఎం.జి.రోడ్డు : లైలా INOX
విజయవాడ : ఊర్వశి INOX	పటమట : LEPL INOX
మచిలీపట్నం : మిని రేవతి	గుడివాడ : ABR సినిమాస్

ఉపాధి పథకానికి
కేంద్రం తూట్లు

- బీజేపీని గద్దె దించండి
- ప్రజలకు వ్యవసాయ కార్మిక సంఘం నేతల పిలుపు

ఉంగుటూరు, ఏప్రిల్ 18: వేసవిలో పనుల్లేక, పూట గడవక ఆకలితో అలమటించే పేదలు, వ్యవసాయకూలీలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వరం లాంటిదని, వలసలు నివారించి, ఆకలి చావులనుంచి తప్పించే ఈపథకానికి తూట్లు పొడుస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.పవన్‌కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి ఆజ్మీర్ వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. వేంపాడు, నందమూరు గ్రామాల్లో ఉపాధిహామీ పథకం పనులను వారు పరిశీలించారు. కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేస్తున్నా, పూర్తి స్థాయిలో వేతనాలు అందటంలేదని, గతనెల వరకు బ్యాంక్ అకౌంట్లలో వేతనాలు జమచేసిన ప్రభు త్వం ఈనెల నుంచి రూ.200తో కొత్తగా పోస్టల్ అకౌంట్లు ఓపెన్ చేయాలనే నిబంధన విధించిందని, చేసిన పనులకు వారంరోజుల్లో రావాల్సిన డబ్బులు నెల దాటినా రావటంలేదని పలువురు కూలీలు తెలిపారు. ఉపాధి నిధుల్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం అవసరాలకు వాడుకుని ఇష్టం వచ్చినప్పుడు కూలీల ఖాతాల్లో జమ చేస్తోందన్నారు. గ్రామ నాయకులు సంసోను, సామ్రాజ్యం, ఎ.వెంకటేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

PLOT FOR SALE



» VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ., బందరు రోడ్డు, గన్నవరం, నున్న నూజివీడు రోడ్డులో కంచికచర్ల దగ్గర ఇళ్ళ మధ్యలో ఇళ్ళ ప్లాట్స్ చ.గ. 1,900/- నుండి 18,500/- సంప్ర : 9390665999
AJB-7

WANTED

» విజయవాడ, కానూరు, న్యూ ఆటోనగర్‌లో రూఫింగ్ మెటీరియల్ హోల్‌సేల్ షాపు నందు పనిచేయుటకు లేడి టెలికాలర్స్ కావలెను. సంప్ర : 95422 23449
AJB-32

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
GST 5%
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
రూ. 290/-
కలర్ 30% EXTRA
1 టౌన్ : 99854 09286, పటమట, పెనమలూరు : 99854 11868, ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733, గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240



బాలకోటేశ్వరస్వామి సేవలో బుద్ధప్రసాద్

అవనిగడ్డ రూరల్ : పాత ఎడ్లంక బాలకోటేశ్వరస్వామిని మాజీ ఉపసభాపతి, ఎన్డీఏ కూటమి అవనిగడ్డ అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ గురువారం దర్శించుకున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో భాగంగా పాత ఎడ్లంక గ్రామంలోని ప్రముఖులు జనసేన పార్టీలో చేరుతున్న సందర్భంగా ఎడ్లంక గ్రామానికి విచ్చేసిన బుద్ధప్రసాద్ స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. జనసేన, టీడీపీ నాయకులు మండలి వెంకట్రామ్, మత్తి వెంకటేశ్వరరావు, గుడివాక శేషుబాబు, యాసం చిట్టిబాబు, చెన్నగిరి సత్యనారాయణ, గుడివాక శివరావు, పీతా వెంకటేశ్వరరావు, సింహాద్రి పవన్, అడపా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.15



బొమ్ములూరులో వెనిగండ్లకు గజమాలతో స్వాగతం



బొమ్ములూరులో టీడీపీలో చేరుతున్న బీసీలు



కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ కోడూరులో జనసేన, టీడీపీ, బీజేపీ ప్రచారం



నాలి గ్రామంలో ప్రచారం చేస్తున్న మండలి వెంకట్రామ్

త్వరలో రాక్షస పాలన అంతం

గుడివాడ రూరల్, ఏప్రిల్ 18 : గుడివాడలో రాక్షస పాలన అంతం అయ్యే రోజులు దగ్గర పడ్డాయని టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. గురువారం బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో వెనిగండ్ల రాము, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు బొమ్ములూరులో పర్యటించారు. మండల టీడీపీ అధ్యక్షుడు వాసే మురళీ గజమాలతో వెనిగండ్ల రాముకు స్వాగతం పలికారు. మహిళలు గుమ్మడికాయలు దిష్టి తీసి హారతులతో స్వాగతం పలికారు. ముందుగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బొమ్ములూరుకు చెందిన 100 మంది బీసీలు ఈ సందర్భంగా వెనిగండ్ల సమక్షంలో టీడీపీలో చేరు. రాము మాట్లాడుతూ ఎన్నికల్లో చంద్రబాబు గెలుపు ఖాయమని, చంద్రబాబు సీఎం అయితే సంక్షేమ పథకాలతోపాటు సంపద సృష్టిస్తారని తెలిపారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గ ప్రజలు రాముకు, జనసేన ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, గుడివాడ అభివృద్ధి చెందాలంటే రామును గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. బూతుల నానికి తగిన బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. మాజీ ఎంపీపీ గుత్తా శివరామకృష్ణ (చంటి) ఇంటి వద్ద బొమ్ములూరుకు చెందిన కొంతమంది టీడీపీలోకి చేరి కండువాలు కప్పుకున్నారు. జిల్లా బీజేపీ అధ్యక్షులు గుత్తికొండ రాజబాబు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మండల పార్టీ అధ్యక్షుడు వాసే మురళీ, మాజీ ఎంపీపీ గుత్తా శివరామకృష్ణ, గుడివాడ అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, గుడివాడ మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, బొమ్ములూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు శొంఠి నాగేశ్వరరావు, శొంఠి గంగాధరరావు, లింగం బాబ్జీ, గుత్తా శ్రీనివాసరావు, లింగం ప్రసాద్, కర్రే వెంకటగిరి, అంగడాల సతీష్, నాయకులు, పాల్గొన్నారు.

నేడే చూడండి
కంకిపాడు :
శ్రీవిజయలక్ష్మి టాకీస్
2K 3D A/C dts



రోజూ 4 ఆటలు :
11-30AM, 02-45PM
06-30PM, 09-45PM



వెనిగండ్ల అల్లుడు డాక్టర్ ప్రతాప్ ప్రచారం

గుడివాడ : ఎన్నికల రణరంగంలో బరిలోకి దిగిన మామ వెనిగండ్ల రాము గెలుపు కోసం ఆయన అల్లుడు డాక్టర్ పిన్నమనేని ప్రతాప్ జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గురువారం స్థానిక 13వ వార్డులో వెనిగండ్ల, బాలశౌరి తరుపున ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మచిలీపట్నం-రేపల్లె రైల్వే లైను సాధిస్తా : బాలశౌరి

చల్లపల్లి, ఏప్రిల్ 18 : నీతి, నిజాయితీలతో స్వార్థం లేని సేవలందిస్తామనీ, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులు వల్లభనేని బాలసౌరి, మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తల ఆత్మీయ సమావేశం లంకతోట రోడ్డులో యువ పారిశ్రామికవేత్త గుత్తికొండ వంశీకృష్ణ ప్రాంగణంలో గురువారం రాత్రి జరిగింది. పెద్దఎత్తున నేతలు, కార్యకర్తలు తరలివచ్చారు. ఎంపీ వల్లభనేని బాలసౌరి మాట్లాడుతూ, ఎంపీగా నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషిచేశానన్నారు. పోర్టు ప్రారం భం, మెడికల్ కళాశాల ఏర్పాటులో తన కృషిని వివరించారు. అవనిగడ్డ నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక మచిలీపట్నం-రేపల్లె రైల్వే లైనును వచ్చే ఐదేళ్లలో సాధిస్తానని హామీఇచ్చారు. పామర్రు-చల్లపల్లి రహదారిని జాతీయ రహదారిగా మార్పుచేయిస్తానన్నారు. ఎదురుమొండి వంతెన నిర్మాణం పూర్తిచేయటంతోపాటు, పోర్టు ఆధారిత పరిశ్రమలు తీసుకువస్తానన్నారు. బుద్ధప్రసాద్‌తో కలిసి నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. అవనిగడ్డ నియోజకవర్గ కూటమి అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, దివిసీమ ఎమ్మెల్యేల ఘన చరిత్రను ప్రస్తుత ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కాలరాశారని మండిపడ్డారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు అవకాశమున్న చల్లపల్లిని ఇద్దరం కలిసి అభివృద్ధి చేస్తామని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్‌డి.విల్సన్ మాట్లాడుతూ, జగన్ ప్రభుత్వం ఎస్సీలకు తీరని ద్రోహం చేసిందని మండిపడ్డారు. ఆయా పార్టీల మండల అధ్యక్షులు మోర్ల రాంబాబు, చోడగం విమల్ కృష్ణ, పిండి రేవతి, బీజేపీ నేత చిరువోలు బుచ్చిరాజు, టీడీపీ నేతలు యార్లగడ్డ శ్రీనివాసరావు, పైడిపాముల కృష్ణకుమారి, ముమ్మనేని నాని, సజ్జా చలపతిరావు, నిడమానూరి దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బాలశౌరి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కాగిత కృష్ణప్రసాద్

ఓటమి భయంతో జగన్ సానుభూతి డ్రామాలు : కాగిత

పెడన : ఎన్నికల్లో తమకు ఓటమి తప్పదని గ్రహించిన జగన్ సానుభూతి డ్రామాలకు తెరతీశారని పెడన నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ విమర్శించారు. గూడూరు మండలం లేళ్ళగరువు గ్రామంలో గురువారం జరిగిన టీడీపీ, జనసేన పార్టీ నాయకుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ఏదో ఒరగబెట్టేశానని ప్రగల్భాలు పలుకుతున్న జగన్ సానుభూతి కోసం వెంపర్లాడటం సిగ్గుచేటన్నారు. తెలుగుదేశం, జనసేన నాయకులు అన్నదమ్ముల్లా పని చేసి లేళ్ళగరువులో తనకు, ఎంపీ అభ్యర్థి బాలశౌరికి మంచి మెజారిటీ తీసుకురావాలని కృష్ణప్రసాద్ విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక లేళ్ళగరువు గ్రామాన్ని అభివృద్ధి పథంలో పయనింప చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. పంచకర్ల సురేష్, పోతన స్వామి, గోపీ నాగ బాబు, ఏన్‌ఏ బేగ్, తలుపుల కృష్ణ, పుప్పాల భద్రయ్య, కాసగాని శ్రీనివాసరావు, సమ్మెట రాఘవప్రసాద్, రాయపురెడ్డి శ్రీనివాస్, గడిగోపుల నాగాంజనేయులు, నాగపోతరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

నేడే విడుదల



విజయవాడ : అలంకార్	విజయవాడ : వెంకటేశ్వరప్యాలెస్
బెంజిసర్కిల్ : క్యాపిటల్‌సినిమాస్	లబ్బీపేట : పీవీపి సినిపోలీస్
లబ్బీపేట : పీవీఆర్ సినిమాస్	ఎం.జి.రోడ్డు : లైలా INOX
విజయవాడ : ఊర్వశి INOX	పటమట : LEPL INOX
మచిలీపట్నం : మిని రేవతి	గుడివాడ : ABR సినిమాస్

నాలి గ్రామంలో వెంకట్రామ్ ప్రచారం

నాగాయలంక : గ్లాస్ గుర్తుపై ఓటేసి బుద్ధప్రసాద్, బాలశౌరిలను గెలిపించాలని కోరుతూ మండలి వెంకట్రామ్, సతీమణి సాయిసుప్రియ గురువారం నాలి గ్రామంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. తెలుగు మహిళ అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, మండల టీడీపీ అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు, మండలి ఉదయ భాస్కర్, బావిరెడ్డి వెంకటేశ్వరరావు, వెంకట శ్రీ నాగలక్ష్మి, లకనం నాగాంజనేయులు, బొం డాడ గణపతిరావు, తాతారావు, మాదివాడ అర్జునరావు, కొక్కిలిగడ్డ నాగరాజు, ఉప్పల ప్రసాద్, బండ్రెడ్డి మల్లిఖార్జునరావు, కొప్పనాతి చిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కోడూరులో ..

కోడూరు : బుద్ధప్రసాద్, బాలశౌరిలను గెలిపించాలని కోరుతూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గురువారం కోడూరు ఒకటో వార్డులో ప్రచారాన్ని ప్రారంభించారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. మత్తి వెంకటేశ్వరరావు, బండే శ్రీనివాసరావు, మర్రె గంగయ్య, వడుగు నాగబాబు, పూతబోయిన శ్రీనివాసరావు, కరుణ కుమార్, శేషగిరిరావు, సునీత, కోట రాంబాబు, ఒడుగు సత్యనారాయణ, దొండపాటి శ్రీనివాసరావు, విఠల్ రావు, సుంకర లక్ష్మీ, కోట రాంబాబు, పిల్లి మల్లిఖార్జునరావు, దామెర్ల నారాయణ, దామెర్ల రఘు పాల్గొన్నారు.



వర్ల విశ్రమ, చాణక్య ప్రచారం

కపిళేశ్వరపురం (పమిడిముక్కల) : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి రాష్ట్రాభివృద్ధికి అందరూ సహకరించాలని పామర్రు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి వర్ల కుమార్ రాజా సతీమణి విశ్రమ, సోదరుడు చాణక్య కోరారు. అసెంబ్లీ అభ్యర్థి కుమార్‌రాజా, మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి బాలశౌరి విజయాన్ని కాంకిస్తూ గురువారం కపిళేశ్వరపురం తూర్పు ఎస్సీ కాలనీ, చోరగుడి శివారు గోపాలకృష్ణపురంలో పర్యటించి ఓట్లు అభ్యర్థించారు. మైనేని ఇందిర, శ్రీనివాసరావు, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



చిలకలపూడి పాపారావు నేతృత్వంలో అవనిగడ్డలో ప్రచారం

మండలి విజయాన్ని కాంక్షిస్తూ..

అవనిగడ్డ : మండలి బుద్ధప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ నేతలు గురువారం అవనిగడ్డలో విస్తృత ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు, జనసేన నేతలు మత్తి వెంకటేశ్వరరావు, గుడివాక శేషబాబు, రాజనాల వీరబాబు, తెలుగుదేశం నేతలు యాసం చిట్టిబాబు, కొల్లూరి వెంకటేశ్వరరావు, భారతీయ జనతా పార్టీ నేతలు తుంగల గిరి తదితరులు స్థానిక లంకమ్మ అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించి అవనిగడ్డ, తుంగలవారిపాలెం గ్రామాల్లో ము మ్మరంగా ప్రచారం చేపట్టారు. సూపర్ సిక్స్ పథకాల బ్రోచర్లతో కూటమి నేతలు ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.



పట్టాభి భవనం ప్రతినిధుల ప్రచారం

మచిలీపట్నం టౌన్ : ప్రజాగళంలో చంద్రబాబు, పవన్ వాగ్దానాలు బందరు ప్రజలకు వరాల జల్లులు కురిపించాయని భోగరాజు పటాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణ కమిటీ ప్రతినిధులు పి.వి.ఫణికుమార్, వేమూరి రామకృష్ణారావు అన్నారు. పట్టాభి భవన సాధన కమిటీ ప్రతి నిధులు ఫణికుమార్, వేమూరి రామకృష్ణారావు, న్యాయవాదులు పుప్పాల ప్రసాద్, మాదివాడ వెంకట నరసింహారావు ఇంటింటికి తిరుగుతూ కూటమి తరఫున ప్రచారం చేశారు. చంద్రబాబు నాయుడు ప్రజాగళం వేదికపై చేసిన వాగ్దానాలకు హర్షం వ్యక్తం చేశారు. స్మారక భవన నిర్మాణానికి ఎంపీ బాలశౌరి, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర కృషి చేస్తున్నందున రానున్న ఎన్నికలకు మద్దతు ఇవ్వాలని కోరారు.

ఆంధ్రజ్యోతి
డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

PLOT FOR SALE



» VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ., బందరు రోడ్డు, గన్నవరం, నున్న నూజివీడు రోడ్డులో కంచికచర్ల దగ్గర ఇళ్ళ మధ్యలో ఇళ్ళ ప్లాట్స్ చ.గ. 1,900/- నుండి 18,500/- సంప్ర : 9390665999

AJB-7

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
GST 5%
REAL ESTATE · SITUATION VACANT · TO LET · AUTOMOTIVE · COMPUTERS · HEALTH CARE · EDUCATION · ENTERTAINMENT
రూ. 220/-
కలర్ 30% EXTRA
మచిలీపట్నం : 99854 11610, గుడివాడ : 99854 09737, చల్లపల్లి : 99854 11331, మైలవరం : 99854 00421, నందిగామ : 99854 11620, నూజివీడు : 99854 02464, తిరువూరు : 99854 09207, ఉయ్యూరు, పామర్రు : 99854 09737

చేనేత, కలంకారీ సమస్యలపై చంద్రబాబుకు పెడన టీడీపీ నేతల వినతి



పెడన, ఏప్రిల్ 18 : చేనేత, కలంకారీ పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలపై బుధవారం పెడన విచ్చేసిన తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, పెడన మునిసిపల్ మాజీ చైర్మన్ బొడ్డు పద్మజాకుమారి వినతిపత్రం సమర్పించారు. టీడీపీ ప్రభుత్వంలో చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పలు పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందనిఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన సహకార సంఘాలు చేనేత కార్మికులకు ఉపాధి కల్పించలేని దుస్థితి నెలకొందన్నారు. కలంకారీ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను కూడాప్రస్తావించారు. చేనేత, కలంకారీ పరిశ్రమల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను చంద్రబాబు నాయుడుకు సూచించారు.

దంపతుల రామభక్తి



అవనిగడ్డ రూరల్ : వృద్ధ దంపతుల రామభక్తి పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది. రామచంద్రాపురం శివారు వలందపాలెం గ్రామానికి చెందిన దాసరి అగ్గి రామయ్య(103) - సభకీర్తి(93) దంపతులు ఎన్నో సంవత్సరాలుగా సీతారామ పట్టాభిషేకాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఆ వయస్సులో శ్రీరామపట్టాభిషేకం జరిపి రామభక్తిని చాటుకున్న వారిని ప్రజలు కీర్తిస్తున్నారు.

ఉండ్రపూడి ఆలయంలో మహా అన్నసమారాధన



పామర్రు : శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఉండ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వీరాంజనేయస్వామి దేవస్థానం వద్ద గురువారం మహా అన్నసమారాధన నిర్వహించారు. ఈవో సత్యవతి అన్నసమారధనను ప్రారంభించారు. సుమారు 22 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారన్నారు. అన్నదానానికి సహకరించిన దాతలకు అభినందనలు తెలిపారు. సీ శుభాకర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నందివాడ (పోలుకొండ) : సీతారాముల కల్యాణం సందర్భంగా పోలుకొండ చిన్న చెరువు రామాలయంలో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పిరమిడ్ పార్టీ అభ్యర్థి పావని నామినేషన్



మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గానికి పిరమిడ్ పార్టీ అభ్యర్థిగా వక్కలగడ్డ పావని గురువారం నామినేషన్ దాఖలు చేశారు. మచిలీపట్నం ఆర్డీఓ, ఎన్నికల అధికారి ఎం.పద్మకు నామినేషన్‌ను దాఖలు చేశారు. పత్రీజీ ఆశయాలకు అనుగుణంగా సత్యం వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ తాను నామినేషన్ దాఖలు చేశానని మీడియాకు తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఎన్నికల నోటిఫికేషన్

కూచిపూడి : ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్ దాఖలు చేసే ఎన్నికల నోటిఫికేషన్ ప్రతులను గురువారం ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రకటించారు. మొవ్వ ఎంపీడీవో కె.చం ద్రశేఖరరావు ఆదేశాలతో వివరాలను పత్రికలకు విడుదల చేశారు.

బృందగాన పోటీల్లో డా.కెకెఆర్స్ విద్యార్థుల ప్రతిభ



గుడివాడ : ఈ నెల 7వ తేదీన మహారాష్ట్ర మరాట్వాడా తెలుగు అసోసియేషన్,ఎ.ఎ.కల్చరల్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన దేశభక్తి గీతాల బృందగాన పోటీల్లో డా.కెకెఆర్స్ గౌతమ్స్ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సత్యారామ్ తెలిపారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు సి.బృందావని, వి.సంకీర్తన, కె.దేవిప్రియ, ఎ.సుస్మిత, పి.హదన పరిమళ చంద్, పి.పూజశ్రీ, జి.శ్యామ్యూల్ చరణ్, డి.నదీవన్ రాజులను ఆయన అభినందించారు. శిక్షణ ఇచ్చిన పి.శ్యామలను ప్రిన్సిపాల్స్ లక్ష్మీప్రసాద్, జ్యోతి, జబ్రీనా, ఉపాధ్యాయులు అభినందించారు.

మత్స్యకార ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

అవనిగడ్డ : అవనిగడ్డలో ఈ నెల 22వ తేదీన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన మత్స్యకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంక్షేమ సంఘం అధ్యక్షులు చిలకలపూడి పాపారావు విజ్ఞప్తి చేశారు. దివి ప్రాంత మత్స్యకార నేతలతో కలిసి గురువారం ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎంపీ బాలశౌరి, మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ తదితరులు పాల్గొంటారన్నారు. మత్స్యకారుల సమస్యలు, వాటి పరిష్కార మార్గాలను చర్చిస్తామని పాపారావు తెలిపారు. మండలి వెంకట్రామ్, మత్స్యకార నేతలు పాల్గొన్నారు.

నామినేషన్ విజయవంతం చేయండి : వడ్డాది



గుడివాడ : ఈ నెల 19వ తేదీన తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్‌ను దాఖలు చేయనున్నట్లు గుడివాడ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వడ్డాది గోవిందరావు(రాజేష్) తెలిపారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో రాహుల్, రాష్ట్రంలో షర్మిల నాయకత్వంలో తాను అభ్యర్థిగా పోటీ చేస్తుండటం గర్వకారణమన్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శిష్లా దత్తాత్రేయులు మాట్లాడుతూ పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున నామినేషన్ కార్యక్రమానికి తరలి రావాలని కోరారు. మహిళా కార్యదర్శి దగాని నిశ్చల తదితరులు పాల్గొన్నారు.

సీయోను వృద్ధాశ్రమానికి గుర్తుతెలియని వృద్ధురాలు

చల్లపల్లి : చల్లపల్లి ప్రధాన కూడలిలో ఉదయం నుంచి రాత్రి వరకూ వృద్ధురాలు అనాథలో కూర్చుని ఉండడంతో స్థానిక దుకాణదారులు స్పం దించి వృద్ధాశ్రమానికి చేర్చారు. దుకాణదారులు మధ్యాహ్నం అల్పాహారం ఇచ్చారు. రాత్రి అయినా ఎవరూ రాకపోవటంతో ఆమెను వివరాలు అడిగారు. నీరసంగా ఉండటంతో వివరాలు సైతం చెప్పే పరిస్థితిలో లేకపోవటంతో ఓఆర్ఎస్ ఇచ్చి, అల్పాహారం పెట్టి ఉపశమనం కలిగించారు. పూలకొట్టు నిర్వాహకుడు ఉప్పాల అమలేశ్వరరావు, మెడికల్ షాపు గుమస్తాలు విస్సంశెట్టి జగదీష్, నారగాని శ్రీనివాసరావు, పండ్ల కొట్టు శ్రీనివాసరావు వృద్ధురాలి సమాచారాన్ని చల్లపల్లి ఎస్సై చినబాబుకు అందించారు. వృద్ధురాలి పరిస్థితిని సీయోను వృద్ధాశ్రమ నిర్వాహకుడు శీలం భాస్కరరావుకు తెలియచేసి ఆమెకు ఆశ్రయం ఇవ్వాల్సిందిగా కోరగా, ఆయన అంగీకరించటంతో ఆశ్రమానికి తరలించారు. ఆశ్రమ నిర్వాహకులు, సిబ్బంది ఆమెకు సపర్యలు అందించారు. వృద్ధురాలి గురించి తెలిసిన వారెవరైనా ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.



వృద్ధురాలిని ఆశ్రమంలో చేర్చిన దుకాణదారులు

తాడిచెట్టు నుంచి జారిపడి ఒకరి దుర్మరణం



మృతుడు సుబ్రహ్మణ్య స్వామి

గుడ్లవల్లేరు : ముంజికాయలు కోసేందుకు తాడిచెట్టు ఎక్కి జారిపడి అక్కడికక్కడే వ్యక్తి మృతి చెందిన సంఘటన పెంజెంద్రలో జరిగింది. గోళ్ల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి (37) గురువారం తన పిల్లలకు తాటి ముంజెలు కోసి పెట్టాలని భావించి తాడిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. తలకు నేలదెబ్బ బలంగా తగలడంలో అక్కడికక్కడే మృతి చెందాడు. గుడ్లవల్లేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కుమార్‌రాజా సోదరుడు చైతన్య ప్రచారం

పామర్రు : పామర్రు అభివృద్ధికి టీడీపీ అభ్యర్థి వర్ల కుమార్ రాజా, బందరు ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరిలను గెలిపించాలని వర్లకుమార్ రాజా సోదరుడు చైతన్య, జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ కోరారు. అంబేద్కర్ విగ్రహం సెంటర్లో గురువారం కూటమి నేతలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

మచిలీపట్నం సౌత్ తహసీల్దార్‌గా నండూరి వెంకటేశ్వరరావు

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం సౌత్ తహసీల్దార్‌గా నండూరి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. బందరును సౌత్, నార్త్ మండలాలుగా విభజించినా ఇప్పటి వరకు ఒక్కరే రెండు మండలాలకు తహసీల్దార్‌గా ఉంటున్నారు. తూర్పుగోదావరి జిల్లా పెనుగొండ తహసీల్దార్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరరావు మచిలీపట్నం సౌత్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారు. వెంకటేశ్వరరావు ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికల ప్రక్రియకు సహాయకులుగా ఉంటున్నారు.

శతాధిక వృద్ధురాలు వెంకాయమ్మ కన్నుమూత



అవనిగడ్డ రూరల్ : వేకనూరు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు భోగాది వెంకాయమ్మ (105) గురువారం మృతి చెందారు. గతంలో ఆమె కుమారుడు భోగాది రాముడు వేకనూరులో ఫ్యాక్షన్ గొడవల్లో హత్యకుగురయ్యాడు. ఆమెకు ప్రస్తుతం కుమార్తె మాత్రమే ఉన్నారు. పలువురు వెంకాయమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మీ కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులకు ఆంధ్రజ్యోతిలో ప్రకటనల ద్వారా తెలియజేయండి.



పూర్తి వివరములకు సంప్రదించండి: ఆంధ్రజ్యోతి ప్రాంతీయ కార్యాలయం
సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా. సెల్ : 99854 01166
మచిలీపట్నం, పెడన : 99854 11610,
చల్లపల్లి : 99854 11331, గుడివాడ : 99854 09737,
ఉయ్యూరు, పామర్రు : 99854 09737